RNI NO:TELTEL/ 2023/89546



# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 462 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 1 జూలై 2025 | వెల : 4/-







# పాశమైలారంలో పేలిన రియాక్టర్

- ఫ్యాక్టరీ పేలుడులో 12 మంది మృతి
- శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!
- ఫ్యాక్టరీలో చెల్లాచెదురుగా పడిపోయిన కార్మికులు
- పేలుడు ధాటికి కుప్పకూలిన రియాక్టర్ షెడ్
- శిథిలాల కింద మరికొంతమంది కార్మికులు!
- పాశమైలారంలో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత..
- భారీగా పోలీసులు మోహరింపు
- పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి
- తమ వారి ఆచూకీ తెలపాలంటూ బంధువులు ఆవేదన

3

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- పాశమైలారం ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..
- సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో భారీ పేలుడు ఘటన
- సిగాచీ రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్
- ప్రమాదంలో 8 మంది కార్మికులు దుర్మరణం
- ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం, అధికారులకు ఆదేశాలు





## ‘మీకో దండం.. మీ పార్టీకో దండం’

- బీజేపీకి రాజాసింగ్ రాజీనామా
- రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా
- బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా
- కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు.
- నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు.
- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం.

## శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో
# రాజీ పడే ప్రసక్తే లేదు

- కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్
- దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారు
- కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉంది
- ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా
- పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారు



హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరేషన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్టుల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. ‘ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్టుల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసేది’ అంటూ ఫైర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి ట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశ పౌరులు లెఫ్ట్ ఉద్యమంలో ఉంటే వారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. కేంద్రంలో - మిగతా3లో



## పాశమైలారం ఘటన బాధాకరం

- ప్రధాని నరేంద్ర మోదీ
- చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం
- క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను
- మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా



## లలిత్‌మోదీకి సుప్రీంలో చుక్కెదురు

- చట్టం నిబంధనలను ఉల్లంఘించిన కేసులో లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా
- బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆఫీస్ బేరర్లు అధికారిక విధుల్లో ఉన్నప్పుడు సమస్య వస్తే ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాలి

# బీజేపీ హైకమాండ్ కీలక నిర్ణయం..
# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనే సస్పెన్స్‌కు తెర
- మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరు బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం.
- అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే.. అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ ఈ నిర్ణయం
- రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం

హైదరాబాద్

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనే సస్పెన్స్‌కు తెరపడినట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరు బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం హైకమాండ్ నుంచి ఆయనకు ఫోన్ వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు రామచందర్ రావు నామినేషన్ దాఖలు చేయనున్నారు. అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే.. అందరి సమ్మతితో ఎన్నిక జరిపే విధంగా హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. తెలంగాణలో బీజేపీలోని కీలక నేతలకు హైకమాండ్ నుంచి ఫోన్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఉదయం 11 గంటలకు అధికారికంగా అధ్యక్ష అభ్యర్థికి సమాచారం ఇస్తామన్న హైకమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అందరూ అందుబాటులో ఉండాలంటూ పలువురు నేతలకు సమాచారం ఇచ్చారు. దీంతో, సదరు నేతలంతా 11 గంటలకు వచ్చే కాల్ కోసం ఎదురు చూస్తున్నట్లు సమాచారం. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు సోమవారం - మిగతా3లో



## చైనీస్ కంపెనీతో ఒప్పందం..
### హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ ఉత్పత్తి చేయనున్న బయోలాజికల్ ఈ సంస్థ

# దేశవ్యాప్తంగా విస్తరించిన ఈ-పాస్‌పోర్ట్ సేవలు

ఏంటిది..? దీని వల్ల లాభాలేంటి..?

దేశంలో పాస్‌పోర్ట్ సేవల వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టింది. పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ (పీఎస్పీ) వెర్షన్ 2.0లో భాగంగా ఈ-పాస్‌పోర్ట్‌ను ప్రవేశపెట్టింది. పాస్‌పోర్ట్‌ల భద్రతను మెరుగుపరచడం, ఇంటర్నేషనల్ ప్రయాణాలను స్ట్రీమ్‌లైన్ చేయడం, నకిలీ, ట్యాంపరింగ్ నుంచి పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత డాటాను సంరక్షించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఇప్పటివరకు పైలట్ ప్రాజెక్టుగా కొద్ది నగరాలకే పరిమితమైన 'ఈ-పాస్‌పోర్ట్' సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. 'పాస్‌పోర్ట్ సేవా ప్రోగ్రామ్ (పీఎస్‌పీ) 2.0' కింద ఈ అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ గతవారం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కొత్త విధానం ప్రయాణికులకు పూర్తిస్థాయి డిజిటల్ ఇండియా అనుభూతిని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

**ఏమిటీ ఈ-పాప్‌పోర్ట్?**

ఇది సంప్రదాయ పేపర్ డాక్యుమెంట్ వంటిదే. ఈ-పాస్‌పోర్ట్ కవర్‌పై బంగారు వర్ణపు చిన్న సింబల్ ఉంటుంది. సంప్రదాయ పాస్‌పోర్ట్‌లకు భిన్నంగా ఇందులో ఎలక్ట్రానిక్ చిప్ ఉంటుంది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) టెక్నాలజీతో ఈ-పాస్‌పోర్ట్ అనుసంధానమై ఉంటుంది. పాస్‌పోర్ట్ కవర్‌లో చిప్, యాంటెన్నా పొందుపరిచి ఉంటాయి. ఈ చిప్‌లోనే పాస్‌పోర్ట్ హోల్డర్ల వ్యక్తిగత, బయోమెట్రిక్ డాటా తదితర కీలకమైన వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. తద్వారా అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో అథెంటికేషన్ సులభతరం అవుతుంది.



**ఈ-పాస్‌పోర్ట్ వల్ల లాభాలు**

భద్రత మెరుగుపడుతుంది. నకిలీ, ఫోర్జరీ, వ్యక్తిగత సమాచారం చోరీ నుంచి ఇందులో ఉండే డిజిటల్ సంతకంతో కూడిన చిప్ రక్షణ కల్పిస్తుంది.

అంతర్జాతీయ ప్రయాణాల సామర్థ్యం పెరుగుతుంది.

ఇందులో ఉండే చిప్ సాయంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు చాలా తక్కువ సమయంలో అథెంటికేషన్ చేయగలుగుతారు.

సరిహద్దుల్లో తనిఖీలు వేగవంతమవుతాయి.

చిప్‌లో స్టోర్ చేసిన సున్నితమైన డాటాను ఇందులోని పబ్లిక్ కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (పీకేఐ)ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. తద్వారా ఆ డాటాను ఎవరూ యాక్సెస్ చేయలేరు. అన్‌ఆథరైజ్డ్ వర్గాలు అందులోని సమాచారాన్ని మార్చలేవు.

**దరఖాస్తు ప్రక్రియ ఇలా..**

ఈ-పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా అధికారిక పాస్‌పోర్ట్ సేవా ప్లాట్‌ఫామ్‌ను సందర్శించాలి.

కొత్త వినియోగదారులు అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఇప్పటికే అకౌంట్ ఉన్నవారు నేరుగా లాగిన్ కావొచ్చు.

ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఫారంను నింపి, సమీపంలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రం (పీఎస్‌కే) లేదా పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలో (పీఓపీఎస్‌కే) అపాయింట్‌మెంట్ తీసుకోవాలి.

ఇ-పాస్‌పోర్ట్ కోసం నిర్ణీత ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

అనంతరం బయోమెట్రిక్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం షెడ్యూల్ చేసిన తేదీన పీఎస్‌కే లేదా పీఓపీఎస్‌కేను సందర్శించి ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

# మస్క్ అద్భుతమైన వ్యక్తి.. ఆ విషయంలోనే మా మధ్య విభేదాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే, మస్క్‌తో విభేదాలపై ట్రంప్ తాజాగా స్పందించారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లు విషయంలోనే ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మస్క్‌పై అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఫాక్స్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. మస్క్‌పై ప్రశంసలు కురిపించారు. 'మస్క్ అద్భుతమైన వ్యక్తి. తెలివైనవారు. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విషయాల్లో ఆయన చాలా బాగా పనిచేశారు' అంటూ ప్రశంసించారు. ఎలక్ట్రిక్ వాహన పన్ను క్రెడిట్ రద్దు నిర్ణయంపై మస్క్ కలత చెందారని అధ్యక్షుడు తెలిపారు. అది అతడికి కఠిన నిర్ణయమే అయినప్పటికీ.. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ కారును కొనాలని తాను కోరుకోనని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే ట్రంప్ యంత్రాంగం తెచ్చిన 'బిగ్ బ్యూటీఫుల్ బిల్లు'ను మస్క్ వ్యతిరేకించడంతోనే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ బిల్లు విషయంలో ట్రంప్‌పై మస్క్ నేరుగానే విమర్శలు గుప్పించారు. ట్రంప్‌ను అభిశంసించి, ఆ స్థానంలో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను అధ్యక్షుడిగా చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సెక్స్ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు సంబంధాలున్నాయని, ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరుందని, అందుకే దానిని ఆయన బయటపెట్టడం లేదంటూ సంచలన ఆరోపణలు చేశారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్ వ్యవహారంలో మస్క్ తీరుతో తాను విసిగిపోయానంటూ ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అంతేకాదు, 'మా బడ్జెట్‌లో నిధులను, బిలియన్ల కొద్దీ డాలర్లను ఆదా చేయాలంటే సులభమైన మార్గం ఎలాన్ మస్క్‌కు ఇచ్చిన ప్రభుత్వ సబ్సిడీలను, కాంట్రాక్టులను రద్దు చేయడమే' అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనతో టెస్లా షేర్లు 14.3 శాతం నష్టపోయి, 150 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. ఒకే రోజు ఇంత గరిష్ట స్థాయిలో నష్టపోవడం టెస్లా చరిత్రలో ఇదే ప్రథమం. ఇది జరిగిన కొద్ది సేపటికి ట్రంప్‌ను అధ్యక్ష పదవి నుంచి అభిశంసించాలంటూ మస్క్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.



మస్క్ పార్టీ 'ద అమెరికా పార్టీ'?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, టెస్లా అధినేత మస్క్ మధ్య తీవ్ర విభేదాలు చోటుచేసుకుని మిత్రులిద్దరూ శత్రువులుగా మారిన క్రమంలో మస్క్ కొత్త పార్టీకి శ్రీకారం చుడతారనే ప్రచారం జరుగుతున్నది. ఇదే విషయాన్ని మస్క్ 'ద అమెరికా పార్టీ' అనే పార్టీ ఏర్పాటు గురించి ఎక్స్‌లో సూచనప్రాయంగా వెల్లడించారు. దీనిపై ఆయన ఇప్పటికే సామాజిక మాధ్యమంలో అభిప్రాయ సేకరణ కూడా జరిపారు. దీంతో ఈ మిలియనీర్ కొత్త పార్టీ పెట్టడం ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతున్నది.

## వారు దేవుడి శత్రువులు.. ట్రంప్, నెతన్యాహుపై ఇరాన్‌లో ఫత్వా జారీ



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుపై ఇరాన్‌లో ఫత్వా జారీ అయ్యింది. ట్రంప్, నెతన్యాహులను శత్రువులుగా పేర్కొంటూ ఇరాన్ మత పెద్ద అయతుల్లా మకరెం షిరాజీ ఈ మేరకు ఫత్వా జారీ చేశారు. వారిద్దరూ దేవుడి శత్రువులని పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ మతాధికారులపై బెదిరింపులను తీవ్రంగా ఖండించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదిరిస్తున్న ఈ ఇద్దరు నేతలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. 'ఇస్లామిక్ వ్యవస్థకు మూలస్తంభాలైన నాయకుల ప్రాణాలకు, ముఖ్యంగా సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ప్రాణానికి ముప్పు తలపెట్టడం మతపరంగా నిషిద్ధం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు అలాంటి శత్రువులకు, వారి నేరాలకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడాలి. వారి తప్పులకు పశ్చాత్తాప పడేలా చేయాలి' అని మతపరమైన తీర్పులో పేర్కొన్నారు.

## ఖర్గేజీ.. అంతా హైకమాండ్ చేతుల్లోనే ఉందా?..

# మీరు హైకమాండ్ కాదా?

**బెంగళూరు:** కాంగ్రెస్‌లో హైకమాండ్ తీసుకునే నిర్ణయాలకే కట్టుబడి ఉండాలనేది ఎప్పట్నుంచో వస్తుంది. రాష్ట్రాల్లో ఏదైనా కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణంలో అది హైకమాండ్ ఫైనల్ చేస్తుంది. ఈ విషయంలో రాష్ట్ర సీఎంలు కూడా హైకమాండ్ మాటకు ఎదురుచెప్పకూడదు. ఈ తరహా పరిణామాలను తరుచూ చూస్తూనే ఉన్నాం. మరి హైకమాండ్ అంటే ఎవరు?, ఏఐసీసీ అధ్యక్షుడే కాంగ్రెస్ హైకమాండ్ కదా.. మరి పార్టీ చీఫ్ అయిన మల్లిఖార్జున ఖర్గే నోట నుంచే హైకమాండ్ చూసుకుంటుంది అనే మాట వస్తే ఏమనాలి? ఇప్పుడు అదే జరిగింది. ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే.. 'హైకమాండ్ చేతుల్లో ఉంది' అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కర్ణాటక రాజకీయాల్లో ఏమైనా మార్పులు ఉండబోతున్నాయాా సీఎంను మార్చబోతున్నారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఖర్గే ఒక్క ముక్కలో తెగ్గొట్టి చెప్పేశారు. అది హైకమాండ్ చేతుల్లో ఉంది అంటూ దాటవేత ధోరణి అవలంభించారు. ఇది బీజేపీకి మంచి టానిక్‌లా దొరికింది. అటు కాంగ్రెస్‌ను, ఇటు ఖర్గేపై విమర్శలు చేయడానికి అవకాశం దొరికినట్లయ్యింది. ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సెటైర్లతో విరుచుపడ్డారు. ' ఇక్కడ హైకమాండ్ అంటే ఎవరు? మీరు కాదా?, కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న మీరు హైకమాండ్ కాదా?, మరి ఇంకా హైకమాండ్ ఎవరు? అని తేజస్వి సూర్య పంచ్‌లు వేశారు. కాంగ్రెస్ హైకమాండ్ కనపడదు.. అది మనకు కనిపించదు.. వినిపించని దెయ్యంలా ఉంటుందేమో. మనం మాత్రం కాంగ్రెస్ హైకమాండ్ ఉందని ఫీలవుతూ ఉండాలి' అని సెటైరికల్ పంచ్‌లు విసిరారు.



## చైనీస్ కంపెనీతో ఒప్పందం.. హెచ్‌పీవీ9 వ్యాక్సిన్ ఉత్పత్తి చేయనున్న బయోలాజికల్ ఈ సంస్థ

**హైదరాబాద్:** ప్రముఖ చైనీస్ ఫార్మా కంపెనీ రెక్‌బయో టెక్నాలజీ కంపెనీతో బయోలాజికల్ ఈ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. దీనిలో భాగంగా హెచ్‌పీవీ9 వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయనున్నారు. రెక్‌బయో కంపెనీ .. బీఈ సంస్థకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నది. హైదరాబాద్‌కు చెందిన బీఈ కంపెనీకి.. డ్రగ్ సబ్‌స్టన్స్, టెక్నాలజీని రెక్‌బయో కంపెనీ అందించనున్నది. ఈ ఒప్పందం ప్రకారం.. భారత్‌లో హెచ్‌పీవీ9 టీకాను వాణిజ్య పరంగా అమ్మేందుకు పూర్తి స్థాయి హక్కులు రానున్నాయి. హెచ్‌పీవీ9 టీకాను.. రికాంబినాంట్ వ్యాక్సిన్‌గా డిజైన్ చేశారు. సుమారు తొమ్మిద రకాల హ్యూమన్ పాపిల్లోమావైరస్ నుంచి ఈ వ్యాక్సిన్ రక్షణ కల్పిస్తుంది. గర్భాశయ, యోని ప్రాంత, మూత్రాశయ, జననేంద్రియ మొటిమలు, నోటి క్యాన్సర్లకు కారణమైన వ్యాధుల నివారణకు ఈ వ్యాక్సిన్ పనిచేయనున్నది. హెచ్‌పీవీ గ్రూపులో సుమారు 200 వైరస్‌లు ఉన్నాయి. కొన్నింటిని హై రిస్క్ వైరస్‌లుగా గుర్తించారు. చాలా వరకు హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్లు.. ఇమ్యూన్ సిస్టమ్ ద్వారా నయం అవుతాయి. హై రిస్క్ హెచ్‌పీవీ ల్ల సర్వైకల్ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉన్నది. మూత్రాశయ, గర్భాశయ, నోటి క్యాన్సర్లు ఎక్కువగా వస్తుంటాయి. 2019లో హెచ్‌పీవీ వల్ల మహిళల్లో సుమారు 6.20 లక్షల క్యాన్సర్ కేసులు నమోదు అయ్యాయి. ఇక పురుషుల్లో ఆ సంఖ్య 70 వేలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా గర్భాశయ క్యాన్సర్ వల్ల మహిళల్లో నాలుగోవంత మరణాలు సంభవిస్తున్నాయి. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో.. సుమారు 90 శాతం సర్వైకల్ క్యాన్సర్ లేదా.. మూత్రాశయ, జననేంద్రియ వ్యాధులు సోకవు. రెక్‌బయో కంపెనీకి చెందిన ఆర్ఈసీ603 ప్రస్తుతం 9 నుంచి 45 ఏళ్ల మధ్య వారికి ఇస్తున్నారు. చైనాలో ప్రస్తుతం మూడవ దశ క్లినకల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ పూర్తి అవ్వగానే, భారీ స్థాయిలో హెచ్‌పీవీ9 వ్యాక్సిన్‌ను బయోలాజికల్ ఈ సంస్థ ఉత్పత్తి చేయనున్నది.



బయోలాజికల్ ఈ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉన్నట్లు రెక్‌బయో కంపెనీ చైర్మెన్ డాక్టర్ లియూ యోంగ్ తెలిపారు. ఈ సహకారంతో అంతర్జాతీయ మార్కెట్లో తమ సంస్థ విస్తరించనున్నట్లు చెప్పారు. హెచ్‌పీవీ9 వ్యాక్సిన్‌ను ఇండియాతో పాటు ఇతర దేశాల్లోనూ అందుబాటులో తెచ్చేందుకు రెక్‌బయో కంపెనీతో భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకున్నట్లు బయోలాజికల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహిమ దాట్ల తెలిపారు. కీలకమైన వ్యాక్సిన్లను అందుబాటులో తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ బంధాన్ని బలోపేతం చేస్తున్నట్లు మహిమ వెల్లడించారు.

## పాశమైలారం ఘటన బాధాకరం

**ఢిల్లీ:** సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాం" అని ప్రధాని మోదీ తెలిపారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. సిగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి కంపెనీకి సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ సహా చాలా భాగం దెబ్బతింది. ఆ సమయంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పరిసరాల్లోనే భారీ సంఖ్యలో కార్మికులు ఉన్నట్లు సమాచారం.




## 'బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకం ఫిక్సింగ్‌లో భాగమే'

**ఢిల్లీ :** తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి నియామకం బీజేపీ-బీఆర్ఎస్‌ల మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనన్నారు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి. బీజేపీ-బీఆర్ఎస్‌లు మ్యాచ్ ఫిక్సింగ్‌లో ఉన్నాయనే విషయం దీని ద్వారా నిరూపితమైందంటూ సెటైర్లు వేశారు. ఈరోజు(సోమవారం, జూన్ 30) ఢిల్లీ నుంచి మాట్లాడిన చామల.. కేసీఆర్ గెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని, అటువంటప్పుడు దోచుకోవడానికి ఏముంటుందని ప్రశ్నించారు కిరణ్‌కుమార్‌రెడ్డి 'మీరు(కేంద్రం) ఏమైనా నిధులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఉపయోగిస్తుంది. బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలుపుకోసం బీఆర్ఎస్ చేసింది అందరికీ తెలుసు. రానున్న రోజుల్లో కూడా ఆ రెండు పార్టీలు అదే రూట్ మ్యాచ్‌తో ముందుకు వెళ్లనున్నాయి. హైదరాబాద్‌లో మెట్రోకు పునాదులు వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం. కిషన్‌రెడ్డి.. తెలంగాణ, హైదరాబాద్ సమస్యల విషయంలో నోరు విప్పరు. హైదరాబాద్ నగర ప్రజకు కిషన్‌రెడ్డి చేసిందేమిటి?, ఈ ఏడాది కేంద్రం నయా పైసా ఇవ్వలేదు. విభజన హామీలు నెరవేర్చలేదు. హైదరాబాద్ మెట్రో కోసం ఐదారుసార్లు సీఎం రేవంత్ ఢిల్లీకి వచ్చారు. మనం కట్టిన ట్యాక్సుల్లో మన వాటా వెనక్కి రావడం లేదు. సీఎం రేవంత్ తన ప్రయత్నం తాను చేస్తున్నారు.. కిషన్‌రెడ్డి కూడా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచెయ్యాలి' అని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు.



## లలిత్‌మోదీకి సుప్రీంలో చుక్కెదురు

**దిల్లీ:** ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనలను ఉల్లంఘించిన కేసులో లలిత్ మోదీకి ఈడీ రూ.10.65 కోట్ల జరిమానా విధించడాన్ని సవాలు చేస్తూ.. ఆ మొత్తాన్ని బీసీసీఐ చెల్లించేలా ఆదేశించాలని ఆయన వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. అయితే, చట్టం ప్రకారం తనను తాను రక్షించుకునే హక్కు లలిత్ మోదీకి ఉందని జస్టిస్ పీఎస్ నరసింహ.. ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఫెమాను ఉల్లంఘించినందుకు ఈడీ తనపై విధించిన రూ.10.65 కోట్ల జరిమానాను చెల్లించేలా బీసీసీఐని ఆదేశించాలని కోరుతూ లలిత్ మోదీ గతేడాది డిసెంబర్‌లో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఆ సమయంలో తాను ఇండియన్ ప్రీమియర్ లీగ్ పాలకమండలికి ఛైర్మన్‌గా ఉన్నానని.. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆఫీస్ బేరర్లు అధికారిక విధుల్లో ఉన్నప్పుడు సమస్య వస్తే ఆ సంస్థే వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా ఆయన వేసిన పిటిషన్‌లో అర్థం లేదని పేర్కొంటూ బాంబే హైకోర్టు దానిని కొట్టివేసింది. జరిమానాగా రూ.లక్ష చెల్లించాలని లలిత్ మోదీని ఆదేశించింది. దీంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. ఐపీఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశాడని లలిత్ మోదీ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీంతో 2010లో లండన్‌కు పారిపోయిన అతడు.. అప్పటినుంచి అక్కడే ఉంటున్నాడు. ఆయనను తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ప్రయత్నాలు చేస్తోంది.



# ఆ గ్యాప్ కొనసాగుతూనే వచ్చింది. పార్టీకి ఇలా దూరం చేసింది!



రాజాసింగ్.. నిన్న మొన్నటి వరకూ బీజేపీలో ఓ సంచలనం. తెలంగాణలో బీజేపీ ఎదుగుదల కోసం కృషి చేసిన నాయకుల జాబితాలో రాజాసింగ్ కచ్చితంగా ఉంటారు. అయితే పార్టీకి ఉన్నపళంగా రాజీనామా చేశారు రాజాసింగ్. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఆశించి నామినేషన్ వేయడానికి బీజేపీ కార్యాలయానికి వచ్చిన రాజాసింగ్.. ఆపై కొద్ది సేపటికే పార్టీకి గుడ్ బై అంటూ ప్రకటించారు.

'మీకో దండం.. మీ పార్టీకో దండం' అని రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ' రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా' అని రాజాసింగ్ ప్రకటించారు. అసలు బీజేపీ అధిష్టానంతో రాజాసింగ్‌కు గ్యాప్ ఎలా ఏర్పడింది.. ఎక్కడ ఏర్పడింది అనే అంశాల్లో కొన్నింటిని పరిశీలిస్తే..

**ఆనాటి గ్యాప్.. కొనసాగుతూనే వచ్చింది..!**

రాజాసింగ్ అంటే బీజేపీ అధిష్టానానికి నమ్మకం. అది ఒకప్పుడు మాట. అది క్రమేపీ దూరం అయ్యింది. మూడేళ్ల క్రితం బీజేపీ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ప్రత్యక్షంగా మద్దతు ప్రకటించారు రాజాసింగ్. 2022లో నుపూర్ శర్మ ఇస్లాం మత ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారానికి దారితీశాయి. ఆ వ్యాఖ్యలపై ఆమెను బీజేపీ సస్పెండ్ చేసిన తర్వాత, రాజాసింగ్ ఆమెను సమర్థిస్తూ వీడియో విడుదల చేశారు. ఇది బీజేపీ అధిష్టానం వైఖరిని తప్పుబట్టినట్లయ్యింది. అధిష్టానాన్ని చాలెంజ్ చేసినట్లు ఉండటంతో రాజాసింగ్‌ను వివరణ ఇవ్వాలని కోరింది అధిష్టానం. ఈ క్రమంలోనే రాజాసింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. 2022 ఆగస్టు 23వ తేదీన రాజాసింగ్‌ను బీజేపీ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత 2024 అక్టోబర్ 22వ తేదీన రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయడంతో తిరిగి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దొరికింది రాజాసింగ్‌కు. అయితే అప్పట్నుంచి అధిష్టానంతో గ్యాప్ మాత్రం కొనసాగుతూనే వచ్చింది. 2024 ఎంపీ ఎన్నికల్లో బీజేపీ నుంచి హైదరాబాద్ ఎంపీగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోటీ చేయిస్తే అనూహ్య ఫలితాలు సాధించవచ్చనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా నడిచింది. అధిష్టానం రాజాసింగ్‌ను హైదరాబాద్ నుంచి పోటీ చేయించాలని చూసింది. ఇక్కడ రాజాసింగ్ మాత్రం ఎంపీగా విముఖత వ్యక్తం చేసిన కారణంగానే ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేశారనేది మరో చర్చ. సస్పెన్షన్ గురైన సందర్భంతో పాటు తరచూ వివాదాలు కూడా రాజాసింగ్–అధిష్టానం మధ్య గ్యాప్‌కు కారణమైంది. ఇటీవల కాలంలో పార్టీ లైన్‌కు భిన్నంగా రాజాసింగ్ వ్యవహరించడంతో ఆయన్ను అధిష్టానం పెద్దగా పట్టించుకోలేదు. ప్రధానంగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ చేసిన వ్యాఖ్యలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలకు సైతం రాజాసింగ్ మద్దతు పలికారు.

బీఆర్ఎస్–బీజేపీ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయన్న కవిత వ్యాఖ్యలను రాజాసింగ్ సమర్థించారు. ఇవన్నీ కూడా అధిష్టానానికి కోపం తెప్పించాయి. రాజాసింగ్ రాజీనామా చేసే క్రమంలో అధిష్టానం పెద్దలు ఎవరూ కూడా ఆయన్ను బుజ్జగించే పని చేయకపోవడమే ఇందుకు ఉదాహరణ. ప్రధానంగా చూసుకుంటే 2022 నుంచే అధిష్టానంతో రాజాసింగ్‌కు సఖ్యత చెడిపోతూ వచ్చిందని, అదే ఇంతవరకూ తెచ్చిందనేది విశ్లేషకుల అభిప్రాయం.

**ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై బీజేపీ సీరియస్**

**హైదరాబాద్:** బీజేపీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాపై ఆ పార్టీ స్పందించింది. మా పార్టీకి వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. రాజాసింగ్ ఆరోపణల్లో నిజం లేదని.. రాజాసింగ్ క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరిందంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. "రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలనుకుంటే స్పీకర్‌కు లేఖ ఇవ్వాలి. పార్టీ అధ్యక్షులకు ఇచ్చిన రాజీనామా లేఖను జాతీయ అధ్యక్షుడికి పంపిస్తున్నాం" అని బీజేపీ పేర్కొంది. కాగా, రాజాసింగ్ తీసుకున్న సంచలన నిర్ణయం.. తెలంగాణ బీజేపీలో కల్లోలం రేపుతోంది. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా.. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా.. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

# పాశమైలారంలో పేలిన రియాక్టర్



**సంగారెడ్డి :** పటాన్‌చెరు అర్బన్: పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడులో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి వంద మీటర్ల దూరం ఎగిరిపడ్డ కార్మికుల్లో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు కార్మికులు చనిపోయారని అధికార వర్గాలు తెలిపాయి. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో 26 మంది కార్మికులకు గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన 12 మంది మృతిచెందారు. ఘటనాస్థలంలో ఐదుగురు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 7 గురు చనిపోయారు.

పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది.

ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చందానగర్, మదీనాగూడలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. 11 ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు. ఘటనాస్థలాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశ్రమ నుంచి ఘాటైన వాసనలు వెలువడుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన దామోదర రాజనర్సింహా**

సంఘటనా స్థలాన్ని మంత్రులు దామోదర రాజనర్సింహా, వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు సంఘటనా స్థలిని పరిశీలించారు. కార్మికులను అడిగి ప్రమాద వివరాలు సేకరించారు. మదీనాగూడలోని ప్రణామ్ ఆస్పత్రిలో 18 మంది చికిత్స పొందుతున్నారని ఆస్పత్రి ఎండీ మనీష్‌గౌర్ తెలిపారు. వీరిలో ఇద్దరు మృతిచెందగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మిగిలినవారి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

**క్షతగాత్రుల వివరాలు..**

నగ్నజిత్ బారి (20) (ఒడిశా) రామ్ సింగ్ (50) (ఒడిశా) రాంరాజ్ (25) (బిహార్) రాజశేఖర్ రెడ్డి (40) (ఆంధ్రప్రదేశ్) సంజయ్ ముఖయా (25) (బిహార్) ధన్‌బీర్ కుమార్ దాస్ (28) (బిహార్) నీలాంబర్ (19) (ఒడిశా) సంజయ్ కుమార్ యాదవ్ (28) (ఒడిశా) గణేశ్ కుమార్ (26) (బిహార్) దేవ్‌చంద్ (30) (బిహార్) యశ్వంత్ (30) (విజయవాడ) అభిషేక్ కుమార్ (బిహార్) నాగర్‌జిత్ తివారీ (ఒడిశా)

**పాశమైలారంలో పరిశ్రమ వద్ద ఉద్రిక్తత..**

పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో పేలుడు సంభవించి 12 మంది మృతిచెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పరిశ్రమ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమ వారి ఆచూకీ తెలపాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని పరిశ్రమలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు.

ఈ క్రమంలో పోలీసులు, కుటుంబసభ్యుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కాగా, ఘటనా స్థలి వద్ద కుటుంబాల రోదనలు మిన్నంటాయి. మరోవైపు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. అయితే గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో సోమవారం భారీ పేలుడు సంభవించి మంటలు ఎగసిపడ్డాయి. భారీ పేలుడు సంభవించడంతో ఆ ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరంలో ఎగిరిపడ్డారు. దీంతో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ఈ ఘటనతో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పేలుడు ధాటికి మూడంతస్తుల భవనం కూలిపోయింది. మరో భవనం బీటలు వారింది. ఇంకోవైపు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని మోదీతోపాటు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఉన్నతాధిరులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరోవైపు.. ఈ పరిశ్రమ వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

## బీజేపీ హైకమాండ్ కీలక నిర్ణయం.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు!

-మొదటిపేజీ తరువాయి

నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరిశీలన, ఉపసంహరణకు అవకాశం కల్పించారు. జూలై 1వ తేదీన అధ్యక్ష ఎన్నిక, ప్రకటన ఉంటుంది. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో 119 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, 38 జిల్లా శాఖల అధ్యక్షులు, 17 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారి తదితరులు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు.

## శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీస్టేడియంలో జరిగే గ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు. గ్రామ శాఖ అధ్యక్షులు నుంచి మండల, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాలు రాష్ట్ర స్థాయి నేతల వరకు 25 వేల మంది ఈ సభలో పాల్గొంటారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. ఎల్బీ స్టేడియంలో జులై 4న ఏర్పాటు చేయనున్న సభ ఏర్పాట్లను ఈరోజు (సోమవారం) కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. జూలై 4న ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న గ్రామస్థాయి అధ్యక్షుల సమ్మేళనం సభకు ఏఐసీసీ చీఫ్ ఖర్గే ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిట శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు పరిశీలించారు.

## 'మీకో దండం.. మీ పార్టీకో దండం'

**హైదరాబాద్ :** తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల కల్లోలం రేపింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. చాలాకాలం తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. కాసేపటికే ఈ ప్రకటన చేయడం గమనార్హం. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నా. కానీ, నా మద్దతుదారుల్ని బెదిరించారు. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదు. వాళ్లు అనుకున్న వాళ్లకే పదవి ఇచ్చారు. అందుకే బీజేపీకి రాజీనామా చేస్తున్నా. రాష్ట్ర అధ్యక్షుడికి రాజీనామా లేఖ ఇవ్వడానికే వచ్చా. నాకు మద్దతుగా ముగ్గురు కౌన్సిల్ సభ్యులు కూడా రాజీనామా చేశారు. రాజాసింగ్ మా పార్టీ సింబల్ మీద గెలిచాడు ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యే కాదని, సస్పెండ్ చేయాలని కిషన్‌రెడ్డే స్పీకర్‌ను కోరాలి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడాం. కానీ, పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారు. బీజేపీ కోసం సర్వం ధారపోశాను. నేను, నా కుటుంబం టెర్రరిస్టుల టార్గెట్‌లో ఉన్నాం. పార్టీ కోసం ఇంత పని చేసినా ఏం లాభం?. అందుకే పార్టీకి లవ్ లెటర్ ఇచ్చి వెళ్తున్నా. మీకో దండం.. మీ పార్టీకో దండం. లక్షల మంది కార్యకర్తల బాధను ప్రతిబింబించే రాజీనామా ఇది(అంటూ లేఖను చూపించారాయన). బీజేపీకి రాజీనామా చేసినా.. హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటాను అని రాజాసింగ్ ప్రకటించారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ రసాయన పరిశ్రమలో సోమవారం ఘోర ప్రమాదం జరిగింది. పరిశ్రమలోని రియాక్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడు తీవ్రత ఎంత భారీగా ఉందంటే, ప్రమాద సమయంలో పనిచేస్తున్న కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం వరకు ఎగిరిపడ్డారు. ఈ పెను విస్ఫోటనానికి ఉత్పత్తి విభాగం ఉన్న భవనం పూర్తిగా కుప్పకూలింది. సమీపంలోని మరో భవనానికి కూడా బీటలు వారాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుని భయానక వాతావరణం నెలకొంది. ఈ దుర్ఘటనలో మొత్తం ఎనిమిది మంది కార్మికులు మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. వీరిలో ఐదుగురు ప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మరికొందరు కార్మికులు గాయపడినట్లు సమాచారం.

**సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

పాశమైలారం పేలుడు ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడారు. శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని సహాయక చర్యలను తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. గాయపడిన వారికి సాధ్యమైనంత మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఒకే రూట్‌లో వెళ్లేవారుంటే.. వారికి ప్రత్యేక బస్సులు: మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్:** నగరంలో కొత్తకాలనీలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా కొత్త రూట్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచేలా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే రూట్‌లో వెళ్లే వారుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి ప్రత్యేక బస్సులు వేస్తామని హామీ ఇచ్చారు. ముషీరాబాద్‌లో పదవీవిరమణ పొందుతున్న 14 మంది ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. వారి సేవల్ని కొనియాడారు. అంతకుముందు అధునాతన టెక్నాలజీ ద్వారా ఆర్టీసీ అమలు చేస్తోన్న డిజిటల్ పేమెంట్స్ అమలును మంత్రి పొన్నం పరిశీలించారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల మూసివేత అంశం కేంద్రం ప్రతిపాదనలో ఉందని, దానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఈవీ పాలసీ తీసుకొచ్చిందని, రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌లో మార్పులు తీసుకొస్తున్నామని తెలిపారు. ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టులు సాంకేతికంగా అమలు చేసేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో అనేక సంస్కరణలు, ఆర్టీసీ ఉద్యోగులకు సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ పాత బకాయిలు చెల్లిస్తూ, నూతన నియామకాలు చేపట్టామని, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. ఆర్టీసీలో ఇప్పటి వరకు 191 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, వారి ప్రయాణం విలువ రూ. 6,300 కోట్లు ఉంటుందని మంత్రి తెలిపారు.

# మా ప్రేమకు అడొస్తే చంపుడే..

## కట్టుకున్న భర్త కంటే ప్రియుడే సర్వస్వం..
## లవర్ కోసం ఎంతకైనా తెగింపు..
## ప్రేమ,పగ,వంచన..ప్రతీకారం
## మేఘాలయలో హనీమూన్ మర్డర్..
## వరుడిని లేపేసిన కర్నూలు యువతి..
## లవ్ గివ్ లేదన్నందుకు తల్లిని చంపేసిన మైనర్..
## ప్రేమను అడ్డుకున్న తండ్రిని హతమార్చిన కూతుళ్లు..







అరవై ఏళ్లకిందటి ప్రేమ కథల్లో ప్రేమికులు త్యాగ శీలురు..అప్పట్లో పరువు,ప్రతిష్టల పరదాల్లో దేవదాసు,పార్వతి ప్రేమానుబంధం..పెద్దరికం వంటివి బందీలు అయ్యాయి.మరో ముప్పై ఏళ్ల తర్వాత ప్రేమ ఖైదీల విముక్తి ఇతివృత్తాలు తెరమీదకు వచ్చాయి.ప్రతీ ప్రేమ కథలోనూ ప్రేమికుడే త్యాగమూర్తి అయ్యాడు.కానీ నేటితరం లవ్ స్టోరీస్ మాత్రం దారుణంగా మారిపోయాయి ఇక్కడ ప్రియురాలు త్యాగ శీలిగా మారి క్రిమినల్ యాక్టివిటీస్లో చిక్కుకుంటోంది. ప్రియుడి కోసం అమ్మానాన్నలను చంపే నీచ స్థితికి నేటితరం యువతులు దిగజారిపోయారు. అంతేకాకుండా తనను ప్రేమించలేదని ఏకంగా యువకులను చంపేస్తున్న ఘటనలు సంతరించుకుంటున్నాయి. ఈ నయా ఘోర నేరాల్లో అతివలే సూత్రధారులు కావటంతో సభ్య సమాజాన్ని కొత్త ఆందోళన వెంటాడుతోంది. కడుపులో ఆడబిడ్డ ఉందని తెలిస్తే గర్భంలోనే చంపేసే కిరాకతకుల్ని నేటి సమాజం ఈసడించుకుంది.కంటే ఆడపిల్లనే కనాలని అవసాన దశలో తమ ఆలనపాలన చూసేది..కన్నీటి వీడ్కోలు పలికేది వారేననే ధోరణికి చాలామంది వచ్చేశారు. ఆడపిల్లలను అల్లారుముద్దుగా పెంచితే..కన్నవారి ప్రేమను కాదని..తాత్కాలిక ఆనందం కోసం అర్రులు చాస్తున్నారు. కంటిరెప్పపై కర్కశత్వాన్ని చూపుతున్నారు.ఆప్యాయత, అనుబంధాల వంటివి చితిమంటల్లో బూడిదగా మారుతున్నాయి.ఇంతటి అన్యోన్యమైన ప్రేమ. పగ,ప్రతీకారాలకు ఎందుకు దారి తీస్తోంది..? అమ్మాయిల్లో క్రూరత్వం..బరితెగింపు..సైకోలుగా మారటానికి కారణమేంటీ?. మితి మీరిన స్వేచ్ఛ వారిలో నేర ప్రవృత్తికి దారితీస్తోందా? ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు లవ్ స్టోరీస్,మిస్టరీ మర్డర్స్ ట్రెండ్ను పరిశీలిద్దాం..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,జూన్30(సూర్యరేఖ)** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. కసాయి కూతురు కన్న తల్లి అని చూడకుండా ప్రియుడితో కలిసి హత్య చేయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎల్బీనగర్లో నివాసముండే సట్ల అంజలీని తన ప్రియుడితో కలిసి గొంతు నులిమి, తలపై కొట్టి కుమార్తె హత్య చేసింది.తన ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసి తల్లి మందలించిందనే కోపంతో ఈ దారుణానికి పాల్పడింది. తన ప్రియుడు, అతని తమ్ముడుతో కలిసి హత్యకు పాల్పడింది. కాగా ఆమె పదవ తరగతి చదువుతోంది.సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు నేర స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ హత్యకు పాల్పడిన అందరూ మైనర్లే కావడం గమనార్హం.గత నెల19న ఇంట్లో నుంచి మైనర్ బాలిక ప్రియుడుతో వెళ్లిపోయింది. దీంతో కూతురు కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.అనంతరం ప్రియుడు మైనర్ బాలికను తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు.దీంతో పోలీసులు అతనికి నోటీసులు ఇచ్చి పంపించారు.ఈ క్రమంలో తల్లిని చంపేయాలని కుమార్తె నిర్ణయించుకుంది.ప్రియుడు,అతని సోదరుడి సహాయంతో...ప్రియుడు,అతని సోదరుడి సహాయంతో తల్లిని హత్య చేసింది.తన ప్రేమకు తల్లి అడొస్తోందనే కోపంతో తల్లిని హత్య చేసింది.

**-తండ్రిని కూతుళ్లే చంపేశారు..**

ప్రేమకోసం కన్న తండ్రిని కూతుళ్లు చంపేశారు. వీరికి తల్లి సహకరించింది. ఈ దారుణ ఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలవరం సృష్టించింది. మరిపెడ మండలం జెండాల తండాలో కిషన్ కు ఇద్దరు కుమార్తెలు.చిన్న కుమార్తె పల్లవి సురేష్ అనే వ్యక్తితో తరచూ ఫోన్లో మాట్లాడుతోంది. గమనించిన తండ్రి పల్లవిని మందలించారు.కానీ అతన్నే పెళ్లి చేసుకుంటానని ఖరాఖండిగా చెప్పేసింది.దీనికి ఒప్పుకోని కిషన్..కాస్తంత గట్టిగానే బదులు చెప్పాడు.ఐతే తన ప్రేమను ఒప్పుకోవట్లేదని ప్రియుడితో కలిసి తండ్రిని చంపేందుకు పల్లవి స్కెచ్ వేసింది.పల్లవికి తల్లి కావ్య,అక్క రమ్య సహక రించారు.పక్క టెముకలు విర గొట్టి, పిడుగు ద్దులతో కిషన్ పైకి దాడి దిగా రు ఇద్దరు కూతుళ్లు.తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కిషన్ మృతి చెందాడు.కిషన్ బంధువుల ఫిర్యాదుతో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**-సోనమ్.. సూపర్ క్రిమినల్..**

పెళ్లి జరిగిన తొమ్మిది రోజులకే భర్తని హనీమూన్ పేరుతో మేఘాలయకు తీసుకెళ్లి ప్లాన్ ప్రకారం హత్య చేయించిన నవ వధువు సోనమ్,ఆమె ప్రియు డుగా భావిస్తున్న రాజ్ కుష్వాహ కలిసి దిగిన ఫొటో ఒకటి బయటపడింది. వీరిద్దరూ ఎంతో హ్యాపీగా ఆ ఫొటోకి ఫోజులిచ్చారు.రాజా రఘువంశీ హత్య కేసు దర్యాప్తులో తాజాగా బయటపడ్డ ఈ కొత్త ఫొటో ఇండోర్ లోని విజయ్ నగర్ ప్రాంతంలో తీశారని పోలీసులు తేల్చారు.రాజా రఘువంశీ మర్డర్ని ప్లాన్ చేసి ఇంప్లిమెంట్ చేసిన నిందితులంతా జైల్లో ఉన్నారు.రాజాని అన్యాయంగా పొట్టనబెట్టుకున్న వీళ్లు, ఎవరో ఒక స్త్రీని హత్య చేసి శరీరాన్ని పూర్తిగా కాల్చి ఆ డెడ్ బాడీ రాజా భార్య సోనమిదిగా చూపించడానికి ప్లాన్ చేశారని మేఘాలయ పోలీసులు వెల్లడించారు.సోనమ్ కోసం తీవ్రమైన సెర్చ్ ఆపరేషన్ జరుగుతుండటంతో ఈ మర్డర్ ప్లాన్ చేశారు. అయితే అదృష్టవశాత్తూ మరో అమాయకపు ప్రాణం బలి కాకుండా పోలీసులకు సోనమ్ చిక్కింది.

**-తేజేశ్వర్ కథ ప్రారంభం ఇలా..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన ఐశ్వర్య అలియాస్ సహస్ర అనే యువతి బ్యూటీషియన్గా పని చేస్తోంది.కర్నూలులోని స్టేట్ బ్యాంకు ఉద్యోగి వివాహితుడు తిరుమలరావుతో ప్రేమబంధం పెంచుకుంది.ఇంతలో ఆమెకు పెళ్లి చేయాలని తల్లి ప్రయత్నాలు ప్రారంభించింది.తల్లి సుజాత కూడా బ్యాంకులో స్వీపర్ గా పని చేస్తోంది. ఐశ్వర్య తండ్రి రామకృష్ణ గతంలోనే మృతి చెందారు. జోగులాంబ గద్వాలలోని రాజావీధి నగర్కు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి గంటా జయరాం,శకుంతల అనే దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు (కవలలు) కుమారులున్నారు. చిన్న కుమారుడు గంటా తేజేశ్వర్ ప్రైవేటు సర్వేయర్గా పనిచేస్తున్నాడు.ఇక ఐశ్వర్యకు, తేజేశ్వర్ కు పెళ్లి కుదిరింది.ఈ ఏడాది ఫిబ్రవరి 13న గద్వాలలో పెళ్లికి పూర్తిగా ఏర్పాట్లు చేయగా ఐశ్వర్య అకస్మాత్తుగా ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో పెళ్లి ఆగిపోయింది.పీటల మీద పెళ్లి ఆగిపోయిందని తేజేశ్వర్ మానసికంగా కుంగిపోయాడు.ఎందుకంటే అప్పటికే తేజేశ్వర్ ఆమెతో ప్రేమలో పడ్డాడు.సడెన్గా మ్యారేజ్ క్యాన్సిల్ కావడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు.అప్పటి నుంచి ముభావంగానే ఉంటున్నాడు.

**-ఆమె పలకరింపుతో..**

అనూహ్యంగా మేనెలలో ఐశ్వర్య నుంచి తేజేశ్వర్కు ఫోన్ వచ్చింది.తన తల్లి కట్నం ఇచ్చుకోలేదని,కట్నం ఇచ్చేందుకు ఆమె పడుతున్న ఇబ్బందులు చూడలేకే తాను ఇంట్లో నుంచి వెళ్లిపోయాయని నమ్మించింది. ఆమె చెప్పిన మాటలను పూర్తిగా నమ్మిన తేజేశ్వర్, తన తల్లిదండ్రులు వద్దని చెప్పినా,కట్నకానుకలు ఏమీ తీసుకోకుండా మే 18న గద్వాల జిల్లాలోని బీచ్పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆమె మెడలో మూడు ముళ్లు వేశాడు.బంధువుల సూచనతో తేజేశ్వర్ తల్లిదండ్రులు కూడా పెళ్లికి హాజరై వధూవరులిద్దరినీ ఇంట్లోకి అనుమతించారు. అకస్మాత్తుగా వరుడు కిడ్నాప్ జూన్ 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తేజేశ్వర్ ఉన్నట్టుండి కనిపించకుండా పోయాడు. దీంతో అంతటా వెతికినా అతని జాడ తెలియకపోవటంతో 18వ తేదీన గద్వాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీ,టెక్నాలజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగించగా,కొందరు వ్యక్తులు అతన్ని కారులో ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు గుర్తించారు.ఏపీలోని ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా దాటి వెళ్లిన ఆ కారు,తిరిగి కర్నూలు వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.దీన్ని ఆధారంగా చేసుకుని నంద్యాల జిల్లా పోలీసులకు సమాచారం ఇవ్వగా, పాణ్యం పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.ఈ క్రమంలో 21వ తేదీ రాత్రి నంద్యాల జిల్లా పాణ్యం పరిధిలోని పిన్నాపురం పరిధిలో గాలేరునగరి కాల్వలో తేజేశ్వర్ మృతదేహం లభించింది. దీంతో స్థానిక పోలీసులు గద్వాల ఠాణాకు సమాచారమిచ్చారు. హత్య చేసి చంపేసినట్లు పోలీసులు నిర్ధారించారు.కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన పోలీసులు పోస్టుమార్టం చేయించారు.

**-అసలు కథ ఇది..**

తేజేశ్వర్ మృతిపై భార్య ఐశ్వర్య పైనే కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు.వివాహేతర సంబంధం నేపథ్యంలోనే కర్నూలులోని ఎస్బీఐ సర్కిల్ వద్ద ఉండే ఓ బ్యాంకు హౌసింగ్ మేనేజర్తో కలిసి ఐశ్వర్య ఈ హత్య చేయించిదనే ఆరోపణల మేరకు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తేజేశ్వర్ భార్య ఐశ్వర్య మార్చి నుంచి జూన్ వరకూ సుమారు 2 వేల సార్లు బ్యాంకు మేనేజర్తో గంటల తరబడి ఫోన్లో మాట్లాడినట్లుగా కాల్ రికార్డులను బట్టి తేలింది.బ్యాంకు మేనేజర్కు అప్పటికే పెళ్లైంది. కానీ తేజేశ్వర్తో నిశ్చితార్థం జరిగిన తర్వాత బ్యాంకు ఉద్యోగినే పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య భావించింది. అందుకే ఫిబ్రవరిలో తేజేశ్వర్తో పెళ్లి జరగాల్సిన సమయంలో కనిపించకుండా పోయి పెళ్లి రద్దుకు కారణమైంది.

**-పక్కా ప్లాన్..**

తేజేశ్వర్తో ఐశ్వర్యకు పెళ్లి నిశ్చయం కాగానే,బ్యాంకు మేనేజర్ తిరుమలరావు ఆమెను తన ఇంటికి తీసుకెళ్లినట్లు సమాచారం.దీంతో అతని కుటుంబంలో ఘర్షణలు తలెత్తడంతో ఐశ్వర్యకు అక్కడ ఉండటం వీలుకాలేదు.బ్యాంకు మేనేజర్తో పెళ్లి కుదరకపోవడంతో తిరిగి మళ్లీ తేజేశ్వర్ వద్దకు వచ్చేసింది.దీంతో తిరిగి తేజేశ్వర్నే పెళ్లి చేసుకోవడానికి ప్లాన్ ప్రకారమే నిర్ణయించుకుంది. తర్వాత కర్నూలులోనే కాపురం పెడితే ప్రియుడు తిరుమలరావును ఎప్పటిలా కలుసుకోవచ్చని కుట్ర పన్నింది. తేజేశ్వర్ గద్వాలలోనే కాపురం పెట్టడంతో ప్రియుడిని కలుసుకోవడం వీలు కాలేదు. తేజేశ్వరు మర్డర్ చేయించేందుకు ఐశ్వర్య తిరుమలరావు కర్నూలుకు చెందిన ఓ సుపారీ గ్యాంగ్తో ఒప్పందం చేసుకున్నారు.ఆ గ్యాంగ్ ముందస్తు ప్రణాళిక ప్రకారం తమ భూమి సర్వే చేయాల్సి ఉందని ఈ నెల 17న తేజేశ్వరు సంప్రదించారు. నమ్మిన తేజేశ్వర్ వారితో కారులో వెళ్లారు.తొలుత ఇటిక్యాల మండలం మొగలిరావు చెరువు వైపు,తర్వాత గద్వాల మండలం వీరాపురం కారులో అతన్ని తీసుకెళ్లారు. అక్కడే కృష్ణస్వామి ఆలయం సమీపంలో కారులోనే మారణాయుధాలతో అతి కిరాతంగా చంపినట్లు సమాచారం. అక్కడి నుంచి ఎర్రవెల్లి మీదుగా గుర్రం గడ్డ వద్ద నేషనల్ హైవేలో యూటర్న్ తీసుకుని కృష్ణా నదిలో హత్య చేసిన ఆయుధాలను, తేజేశ్వర్కు ల్యాప్టాప్, సెల్ఫోన్లను పడేశారు. అనంతరం అలంపూర్ మండలం బైరాపురం దారి గుండా పంచలింగాలకు చేరుకున్నారు.

**-ఐశ్వర్య తల్లితోనూ తిరుమలరావు సెటప్..**

తిరుమలరావు అక్కడికి చేరుకుని,తేజేశ్వర్ మృతిని నిర్ధారించుకుని సుపారీగ్యాంగు కొంత నగదు ఇచ్చినట్లు సమాచారం తెలిసింది.అక్కడి నుంచి ఏపీలోని నంద్యాలకు దగ్గర్లోని పాణ్యం అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన తేజేశ్వర్ మృతదేహాన్ని దుండగులు పడేశారు.పెళ్లయిన 29 రోజుల్లో దాదాపు 15 రోజులు ఐశ్వర్య కర్నూలులోనే ఉండటం ఇది అసలు ట్విస్టు. బ్యాంకు ఉద్యోగితో 4 నెలల్లో దాదాపు 2 వేల వరకు ఫోన్కాల్స్ వందల ఎస్ఎంఎస్లు చేసినట్లు డాటా ద్వారా తెలిసింది.మరోవైపు ప్రధాన నిందితుడికి ఐశ్వర్య తల్లితో కూడా వివాహేతర సంబంధం ఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

# ఓ.పి ఆర్ట్ స్టూడియోని ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్





**ఉప్పల్,జూన్ 30 (సూర్యరేఖ)**చిల్కానగర్ డివిజన్ లోని చిల్కానగర్- ఉప్పల్ ప్రధాన రహదారి బీరప్ప గడ్డ హనుమాన్ టెంపుల్ పక్కన ప్రొప్రైటర్ ఓం ప్రకాష్ ఏర్పాటు చేసుకున్న ఓ.పి.ఆర్ట్ స్టూడియోని ముఖ్యఅతిథులుగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ మొదటగా ఓంప్రకాష్ కు అభినందనలు తెలుపుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా వ్యాపారాన్ని ఏర్పాటు చేసుకొని అభివృద్ధి చేసుకోవాలన్నగొప్ప సంకల్పం తో ముందుకు వస్తున్నందుకు ఓంప్రకాష్ కు అభినందిస్తూ వారు ఏర్పాటు చేసుకున్న ఆర్ట్ స్టూడియో దినదిన అభివృద్ధి చెంది గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి కోకొండ జగన్,బింగి శ్రీనివాస్ ఎండీ. షఫీ శ్యామ్ బాలు,బంటిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్య హక్కుచట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి.!**

**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి.!**

**ప్రభుత్వ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలి..**

**పాఠ్యపుస్తకాలలో మహనీయుల జీవిత చరిత్రను పొందుపరచాలి..**

**డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ డిమాండ్**



**నిజాంపేట,జూన్30(సూర్యరేఖ)** విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసి ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలను అంద జేసి,కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలని దళిత బహుజన ఫ్రంట్(డిబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామంలో డిబీఎఫ్ ఆధ్వర్యంలో విద్యా హక్కుల పరిరక్షణకై ప్రచార ఉద్యమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించి,విద్య హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు విద్యాసంస్థలలో కూడా పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠ్యపుస్తకాలలో మహనీయుల జీవిత చరిత్రను పొందపరచాలని ప్రభుత్వ కళాశాలలో కూడా చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.విద్యారంగ సమస్యల సాధన కోసం డిబిఎఫ్ ఆధ్వర్యంలో పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యం, రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు యాదగిరి రెడ్డిని సన్మానించిన కప్పర సాయికిరణ్ గౌడ్





**ఉప్పల్,జూన్ 30 (సూర్యరేఖ)** మల్లాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు యాదగిరి రెడ్డి పదవి విరమణ పొందిన సందర్భంగా మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్,యాదగిరి రెడ్డిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ...యాడిగిరిరెడ్డి పాఠశాలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు.తన సొంత నిధులతో పాఠశాల అభివృద్ధి చేశారని కొనియాడారు.పదవి విరమణ పొందడం సహజమే అయినప్పటికిని మల్లాపూర్ ప్రజలు ఆయన చేసిన సేవలను ఎప్పుడు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.పదవి విరమణ పొందిన యాదగిరి రెడ్డి శేష జీవితం కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెరుపు బాలరాజ్, కోయగూర బాలరాజ్,వినోద్ యాదవ్,మధు యాదవ్ తోప్ సాయి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## అబ్బురపరిచిన పట్నం ప్రియాంకగౌడ్ రూపొందించిన కుర్చీ..



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్ 30 (సూర్యరేఖ)** హోమ్‌స్టెక్ ఆధ్వర్యంలో హిటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరిగిన మెగా ఈవెంట్ హోమ్‌స్టెక్ మెగా ఈవెంట్ 2025లో ఇంటీరియర్ డిజైన్ విద్యార్థిని పట్నం ప్రియాంక గౌడ్ రూపొందించిన ఒక అద్భుతమైన కుర్చీ సందర్శకులందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.ఈ ప్రత్యేకమైన సృష్టిని చూసి మెచ్చు కున్న వారిలో సనత్‌నగర్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ఉన్నారు.ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ. ప్రియాంకగౌడ్ డిజైన్,కఠినమైన వెస్ట్రన్ శైలిని,సున్నితమైన భారతీయ హస్తకళను అప్రయత్నంగా సమ్మిళితం చేసింన అద్భుతమైన సమ్మేళనం అన్నారు.ప్రీమియం ఇండియన్ టేకు కలపతో చేతితో చెక్కబడిన ఈ కుర్చీలోని ప్రతి వివరాలు ఒక ఆసక్తికరమైన కథను చెబుతాయన్నారు.దీని ముందు కాళ్ళు,ఎత్తైన బూట్ల ఆకారంలో,అడవి సరిహద్దు ప్రాంతాల స్వచ్ఛమైన స్ఫూర్తిని గుర్తుకు తెస్తాయని,దీనికి పూర్తి భిన్నంగా వెనుక కాళ్ళు మనిషి చేతుల్లా చెక్కబడ్డాయని కొనియాడారు.ఇది బలం,సంరక్షణ, సంప్రదాయం పట్ల లోతైన గౌరవాన్ని సూచిస్తుందని తెలిపారు.టేకు కలప యొక్క సహజమైన ఆకృతిని హైలైట్ చేసే సహజ పాలిష్‌తో పూర్తి చేయబడిన ఈ కుర్చీ కేవలం ఒక ఫర్నిచర్ వస్తువు మాత్రమే కాదని,ఇది నిజంగా సంభాషణను ప్రారంభించే, సేకరించదగిన కళాఖండం అన్నారు ఇది రెండు విభిన్న సంస్కృతుల అద్భుతమైన సమ్మేళనాన్ని ప్రదర్శిస్తుందని కొనియాడారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ..



**నిజాంపేట,జూన్30(సూర్యరేఖ)** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి అన్నారు.ఈ మేరకు నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన సంగెపు కార్తీక్ రూ.13 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు.ఈ కార్యక్రమంలో తిరుమలనాథ స్వామి ఆలయ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి,ఆలయ డైరెక్టర్ బాజా రమేష్,కాకి రాజయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మన మల్లేష్, అక్కపల్లి అబ్బారెడ్డి,రెడ్డి యాదగిరి,ఆకుల లక్ష్మీనారాయణ,సంగేపు నారాయణ, పరుశరాములు,తదితరులు పాల్గొన్నారు.

## నందిగామలో పౌర హక్కుల దినోత్సవం..



**నిజాంపేట,జూన్30(సూర్యరేఖ)** మండల పరిధిలోని నందిగామ గ్రామంలో సోమవారం స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్,ఎస్ఐ రాజేష్,ల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో కుల వివక్ష,అంటరానితనం,హోటల్ లో రెండు గ్లాసుల పద్ధతి విడనాడాలన్నారు.ఎవరైనా కులం పేరుతో దూషించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని లేదా 100 డైల్ చేయాలన్నారు.అనంతరం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రీతి,హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్, కార్యదర్శి యాదవ లక్ష్మి,కరోబార్ నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కమిషనర్ ను కలిసిన కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్

**డివిజన్ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్**



**ఉప్పల్,జూన్30 (సూర్యరేఖ)**జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను వారి కార్యాలయంలో సోమవారం హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ లో పలు అభివృద్ధి పనులు రోడ్ల నిర్మాణం గురించి, ఎస్ఎన్ డిపి పనుల గురించి చర్చించడం జరిగింది. అదేవిధంగా రామ్ రెడ్డినగర్ నుండి నాగోల్ వరకు సిఆర్ఎమ్ పి రోడ్డు విస్తరణ పనుల గురించి వివరించారు.అనంతరం రామ్ రెడ్డినగర్ నాలాకు రిటేర్నింగ్ వాల్ నిర్మించాలని కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని పనులను చేయిస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత దీక్ష



సంఘీభావ మద్దతు తెలిపిన ఉప్పల్ బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జూన్30(సూర్యరేఖ)**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మొన్నటి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఉద్యమకారుల అంశం, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఇందుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత దీక్షలకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శ్రీకారం చుట్టడం జరిగింది.అందులో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉప్పల్ నియోజకవర్గం,మేడ్చల్ జిల్లా పరిధిలోని ఉద్యమకారుల ఐక్యతే బలంగా ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం వద్ద ప్రభుత్వానికి విన్నప ధోరణితో.. శాంతియుత దీక్షకు శ్రీకారం చుట్టగా ఇట్టి దీక్ష చేపట్టారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించి దీక్షలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఉద్యమకాలకు ఇచ్చిన హామీలు 250 గజాలు ఇంటి స్థలం, రూ.25 వేల పెన్షన్,ప్రతి ఉద్యమకారునికి గుర్తింపు కార్డు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలలో 20 శాతం కోట,అలాగే ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,జెఏసి ఉప్పల్ నియోజకవర్గం చైర్మన్,డి.ఎస్.ఎస్ నేషనల్ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ,రహీం,మహేష్ గౌడ్, మనెమ్మ,కుమారస్వామి,సప్పిడి శ్రీనివాస్ కనకయ్య, బిజెపి నాయకులు సీతారాంరెడ్డి మంజుల పాల్గొని దీక్షకు మద్దతు ఇచ్చారు.దీక్షలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు దయానంద్, జానకి రెడ్డి అనంతలక్ష్మి జగన్ యాదవ్,జంగా సుదర్శన్,దొమ్మటి కిరణ్ కుమార్ భాను ప్రకాష్, శివకుమార్ నేత రాంచందర్ రాజేందర్,ప్రభాకర్, ప్రసాద్ గణేష్ సందీప్ మహేశ్వరి,విజయ,ఉష, యాదలక్ష్మి యాదమ్మ మల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏ వారసుల ముందస్తు అరెస్టులు..



**నిజాంపేట,జూన్30(సూర్యరేఖ)** మండల కేంద్రంలో సోమవారం ఉదయం వీఆర్ఏ వారసులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వీఆర్ఏల జేఏసీ పిలుపు మేరకు వీఆర్ఏ వారసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయ ముట్టడికి వెళుతున్న తరుణంలో పోలీసులు గృహనిర్బంధం చేసి అరెస్ట్ చేయడం దారుణమంటూ అక్రమ అరెస్టులకు నిరసన తెలిపారు.వీఆర్ఏ వారసుల సమస్యలను పరిష్క రించాలన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు నవీన్ తాడెంతిరుపతి అనిల్ అజీజ్ మియా,ఉన్నారు.

## బెల్లంపల్లి చిన్న మధ్య తరగతి వ్యాపారులకు న్యాయం చేయాలి..



**బెల్లంపల్లి,జూన్ 30 (సూర్యరేఖ)**బెల్లంపల్లి పట్టణం 19వ వార్డు బెల్లంపల్లి బస్తీ నిరుపేదల ప్రజల చిన్నచిన్న దుకాణాలను మున్సిపాలిటీ అధికారులు కూల్చివేయడం సమంజసం కాదని ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు అన్నారు.పట్టణ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ కు వినతిపత్రం అందజేశారు.దినసరి ఆదాయంతో బ్రతికే పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణాల బాధితు లకు న్యాయం జరిగేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ రమేష్,మాట్లాడుతూ...విచారణ చేసి అందరికీ న్యాయం జరిగేటట్టు చూస్తానని తమకు తెలిపారని.ఈ సందర్భంగా వారు తెలిపా రు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఓఆర్ఆర్‌పై ఒకదానికొకటి ఢీకొన్న 9 కార్లు..2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)**ఔటర్ రింగ్ రోడ్డుపై (ఓఆర్ఆర్) రాజేంద్రనగర్ సమీపంలో భారీ రోడ్డు ప్రమాదం జరిగింది.సోమవారం తెల్లవారుజమున ఓఆర్ఆర్‌పై చెన్నమ్మ హోటల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది.వేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు.దీంతో దాని వెనకవస్తున్న కార్లు ఒకదానికొకటి వరుసగా ఢీకొన్నాయి.ఇలా మొత్తం తొమ్మిది కార్లు ఒకదానికి ఒకటి గుద్దుకున్నాయి. అవన్నీ రోడ్డుకు అడ్డంగా ఆగిపోవడంతో 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఓఆర్ఆర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.ప్రమాదానికి గురైన కార్లను తొలగించారు.అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.అందులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.వారిని ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల ఆరోగ్యానికి కొత్త దారులు



డాక్టర్ అనూష బింగి

**ఉప్పల్,జూన్29 (సూర్యరేఖ)** డాక్టర్ అనుష బింగి (ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్) చేసిన అద్భుతమైన చర్యతో..పెద్ద సమస్యకు పరిష్కారం..42 ఏళ్ల మీనా ఓ స్కూల్ టీచర్,ఇద్దరు పిల్లల తల్లి,ఆమె జీవితాన్ని చెడగొట్టినవి, గర్భాశయంలో ఉండే ఫైబ్రాయిడ్లు.తీవ్రమైన రక్తస్రావం,నొప్పి,అలసట ఆపరే షన్ తప్పదని అందరూ చెప్పిన వేళ,ఆమె అడుగు వేసింది డాక్టర్ అనుష బింగి,ఇంటర్వెన్షనల్ రేడియాలజీ నిపుణురాలి దగ్గరకు వచ్చారు" గర్భాశ యాన్ని పోగొట్టుకోవడం భయంగా అనిపించిందని మీనా ఆవేదన గురైంది. కానీ డాక్టర్ అనుష ఆశను ఇచ్చారని పేషంట్ మీనా తెలిపారు. డాక్టర్ అనుష చేసింది పెద్ద శస్త్రచికిత్స కాదు.కేవలం సున్నితమైన యూటీరినే ఫైబ్రాయిడ్ ఎంబోలిజషన్ (యుఎఫ్ఈ)అనే ప్రక్రియ,కాలు వద్ద చిన్నదిగా చేసిన ఓసూది ద్వారా రక్త నాళాలను అడ్డగించి ఫైబ్రాయిడ్లకు రక్తసరఫరా నిలిపేశారు. శస్త్రచికిత్స లేదు,ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన పనిలేదు తక్కువ నొప్పితో ఉటరస్ ఒక వారం లోపల మీనా మళ్లీ బోర్డు ముందు నిలబడింది తాను అమ్మగా,టీచర్ గా తిరిగి జీవితం ప్రారంభించింది.

**యుఎఫ్ఈ అంటే ఏంటి.?**

యుఎఫ్ఈ అనేది ఒక మినిమల్ ఇంటర్వెన్షన్ చికిత్స.గర్భాశయంలో ఉండే ఫైబ్రాయిడ్లను శస్త్రచికిత్స లేకుండా మాయ చేస్తుంది. గర్భాశయాన్ని కాపాడు తుంది.తగ్గిన నొప్పి, త్వరితగతి రికవరీ హాస్పిటల్ లో ఎక్కువ రోజులు ఉండాల్సిన పనిలేదు.ప్రతి మహిళకు ఎంపిక చేసే హక్కు ఉంది.అవసరం లేని శస్త్రచికిత్సను నివారించొచ్చని డా.అనుష బింగి తెలిపారు.డాక్టర్ అనుష బింగి గురించి 2025 ఉత్తమ వైద్యురాలిగా సత్కారం పొందిన నిపుణురాలు ఎం.జి ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్స్ లో నిపుణులు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి మీకు ఫైబ్రాయిడ్స్,ఎక్కువ రక్తస్రావం నొప్పులు ఉంటే - ఆపరేషన్ తప్పనిసరి కాదు.

**-యుఎఫ్ఈ గురించి తెలుసుకోండిదిడా.అనుష బింగి ను సంప్రదించండి..**

హైదరాబాద్ అపాయింట్మెంట్స్ కొరకు 9160506566/8500123441) వెబ్ సైట్ :సంప్రదించవచ్చని డాక్టర్ అనూష బింగి కోరారు.

# బీజేపీ గెలవకూడదనుకునే వాళ్లు పార్టీలో ఎక్కువయ్యారు

**రాజాసింగ్**

**బీజేపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ గుడ్ బై..**



**నాంపల్లి,హైద్రాబాద్,జూన్30 (సూర్యరేఖ)** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ భారతీయ జనతా పార్టీకి సోమవారం రాజీనామా చేశారు.ఈ సందర్భంగా రాజా సింగ్ మాట్లాడుతూ...తనను పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వెయ్య నివ్వలేదని,అందుకే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపించినట్లు అయన తెలిపారు.పార్టీకి రాజీనామా చేయడంతో తన ఎమ్మెల్యే పదవి రద్దు చేయాలని కోరుతూ స్పీకర్ లేఖ పంపాలని కిషన్ రెడ్డిని కోరినట్లుగా పేర్కొన్నారు.పార్టీ కోసం ఎంతోకాలం కష్టపడ్డాను,అధికారంలోకి రావాలని ఎంతో కృషి చేశా అయినా పార్టీలో గుర్తింపు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీకి చేసిన సేవ కారణంగా తాను,తన కుటుంబం ఉగ్రవాద హిట్ లిస్ట్ లో ఉన్నామని గుర్తు చేశారు.రాష్ట్రంలో బీజేపీ పార్టీ గెలువకూడదని అనుకునే వాళ్లు సంఖ్య రోజు రోజుకి అధికమౌతుందని అన్నారు.అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వచ్చానని,అయితే వేయకుండా అడ్డుకోవడమే కాకుండా తన మద్దతుదారుల ను బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశా రు.పార్టీలో సరియైన గుర్తింపు,విలువ లేనప్పుడు ఆ పార్టీలో ఉండలేనని అన్నారు.చివరగా మీకు మీ పార్టీకి ఒక దండం అంటూ రాజా సింగ్ కమలనానికి గుడ్ బై చెప్పి వెళ్లారు.

## దైవ సేవకురాలు యేసుమణెమ్మ జీవితం క్రైస్తవులకు ఆదర్శదాయకం



**హైదరాబాద్,జూన్ 30(సూర్యరేఖ)** స్థానిక జెమినీ కాలనీలోని బెతెస్థా ప్రేయర్ ఫెలోషిప్ చర్చి వ్యవస్థాపకురాలు యేసుమణి గత 25న అస్వస్థతో ప్రభువు నందు నిద్రించారు. ఆమె జ్ఞాపకార్థసభ సోమవారం బెతెస్థా చర్చిలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాస్టర్ విజయ్ మాట్లాడుతూ...నీతిమంతులను జ్ఞాపకం చేసుకొనుటకు ఆశీర్వాదకరమన్నారు. పాస్టర్ యేసుమణెమ్మ హైదరాబాద్ జంటనగరాలలో మొట్టమొదటగా మహిళా పాస్టర్ గా చర్చి సేవలు ప్రారంభించి అనేక మందికి క్రీస్తు సువార్త ప్రకటించి రోగులకు స్వస్థత,విడుదల, సామాజిక సేవాకార్యక్రమాలు చేశారు.కుల,మత,ప్రాంతాలకు అతీతంగా పేద మధ్యతరగతి ప్రజలకు విద్యా,వైద్య,వృత్తి శిక్షణా సలహాలిస్తూ,వారిని దైవభక్తిలో నడిపిస్తూ వందలాది కుటుంబాలకు తన బైబిల్ వాక్య పరిచర్యతో క్రైస్తవ విశ్వాసం మార్గంలో నడిపించారు.రాంనగర్, మొయినాబాద్,సంగారెడ్డి,పటాన్ చెరు ఏరియాల్లో సుమారు 30 మందికి పైగా పాస్టర్లను చర్చిలను స్థాపించారు.ఈ కార్యక్రమంలో యేసుమణెమ్మ కుమారులు జి.దేవిడ్,జి.విజయ్ కుమార్,కుటుంబ సభ్యులు షారోన్ ప్రవీణ్ శిరిషా రజిత రిత్విక్,ధరణి, విపుల్ ప్రిన్స్,డింపు,పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

# బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు





**ప్రపోజ్ చేసిన కొయ్యల ఏమాజి,పోషం**

**బెల్లంపల్లి,జూన్30(సూర్యరేఖ)** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు ఎన్నిక పట్ల బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి హర్షం వ్యక్తం చేశారు.సీనియర్ న్యాయవాదికి,పార్టీ విధేయునికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. ఆయన క్రమశిక్షణ కలిగిన గొప్ప నాయకుడు అని తెలిపారు.ఆయన నాయకత్వం లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఆయన పేరును ప్రపోజ్ చేసే అవకాశం నాకు కల్పించి గౌరవం కల్పించిన రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఆయన నామినేషన్ పత్రాలపై కొయ్యల ఏమాజి అరుముల్ల పోషం ప్రపోజ్ చేశారు.రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన రామచందర్ రావును అభినందించారు.

# గురుకులంలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు



**బెల్లంపల్లి,జూన్30(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట గురుకుల పాఠశాల,కళాశాలలో స్టూడెంట్స్ అకాడమిక్ యాక్టివిటీలో భాగంగా సోమవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ. కెప్టెన్,వైస్ కెప్టెన్ ఎన్నిక కొరకు ప్రజా పద్ధతిలో ఎన్నికలు నిర్వహణ కోసం విద్యార్థులు ఎవరికైతే ఆసక్తి కలిగి ఉన్నారో ఆ విద్యార్థులు నామినేషన్ వేసి పోటీ చేస్తున్నారని అన్నారు. నామినేషన్ చేసిన ప్రతి విద్యార్థి తమ హామీలను పాఠశాల కళాశాలలో వనరులను సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలో బోధన బోధనేతర విషయాలలో ఎలా ఉండాలో ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు వివరించారు.ఈ స్కూల్ ఎన్నికలలో కెప్టెన్ నలుగురు వైస్ కెప్టెన్ నలుగురు పోటీ చేశారు.వారికి తగిన చిహ్నాలను కేటాయించడం జరిగినది.రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్ స్వీకరణ,తిరస్కరణ చేశారు.ఎన్నికల నిర్వహణ కోసం ప్రిసైడింగ్ ఆఫీసర్,పోలింగ్ ఆఫీసర్ పోలింగ్ బూత్ ఏజెంట్లను,మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు.ఓటింగ్ వేసిన విద్యార్థులకు చూపుడువేలు పైన సిరా గుర్తును వేశారు. పాఠశాలలోని విద్యార్థులు తమ ఓటు హక్కును వంద శాతంవినియోగించుకున్నారు.ఈ విధంగా విద్యార్థులు సక్రమంగా ఓటు వేసే విధంగా విధులు నిర్వహించారు.విద్యార్థులు ఏజెంట్లుగా ఉండి బ్యాలెట్ పత్రాలను చక్కగా జాగ్రత్త పరిచారు.ఈ పోలింగ్ లో భాగంగా త్రీటౌన్ తాళ్ల గురజాల ఎస్సై రమేష్,ఏఎస్ఐ అలీ విచ్చేసి ఓటింగ్ సరళిని చూసి తగిన సూచనలను విద్యార్థులకు ఇచ్చారు. విద్యార్థులు ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించిన విధానానికి ఎస్సై ఎఎస్ఐ అభినందించారు. అనంతరం ఓట్లను లెక్కించారు.దానిలో గెలిచిన కెప్టెను,వైస్ కెప్టెన్ ను ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు రమేష్ పి.నరేందర్ ఎ.శైలజ,ఎల్.శ్రీనివాస్,ఎస్ మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి రోడ్ల దుస్థితి.. పట్టించుకోని అధికారులు





**వివరాలు తెలిపిన బిజెపి నాయకురాలు న్యాయవాది నల్లుల సంగీత**

**బెల్లంపల్లి,జూన్ 30(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణ లోని సింగరేణి ఏరియా హాస్పిటల్ నుండి,బజారు ఏరియా మార్కెట్ వరకు రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారి ప్రజల వాహనాల రాకపోకలకు ఇబ్బంది మారిన సంబంధించిన అధికారులు,ఆర్ బి అధికారులు పట్టించుకోవడం లేదని బెల్లంపల్లి బీజేపీ నాయకురాలు న్యాయవాది నల్లుల సంగీత ఆరోపించారు.రాత్రి సమయంలో రోడ్లపై నిలిచి ఉన్ననీళ్లతో గుంతలు కనపడక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని,ఎవరికైనా ద్విచక్ర వాహనాలదారులు బండ్లు అదుపు తప్పి పడిపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని,అలా అయితే వాళ్ల కుటుంబాలు రోడ్డు మీద పడతారని అలాంటి సంఘటన జరగకముందే అధికారులు స్పందించి వెంటనే అధికారులు స్పందించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని కోరారు, లేనిపక్షంలో ప్రజలతో ఇదే రోడ్లపై కూర్చొని ధర్నా చేస్తామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు.

## హెచ్ఈసీ గ్రూపులో చేరే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్



**రామాయంపేట,జూన్30(సూర్య రేఖ)** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ గ్రూపులో చేరే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందచేయడం జరుగుతుందని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హిస్టరీ లెక్చరర్ గూడూరి మల్లేశం చెప్పారు.సోమవారం గ్రూపులో చేరిన విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు.పదవ తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు ఉపకార వేతనాలు అందించడం జరుగుతుందన్నారు.అనుభవం గల లెక్చరర్లతో విద్యాబోధన అందించడం జరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ సురేందర్ రెడ్డి ఉన్నారు.

## పదవి విరమణ అధికారులకు ఘన సన్మానం..



**మందమర్రి,జూన్30(సూర్యరేఖ)** మందమర్రి ఏరియాలో సుదీర్ఘకాలంగా సింగరేణి సంస్థకు సేవలందించి పదవి విరమణ పొందిన అధికారులను ఏరియా జిఎం.దేవేందర్,ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. జిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో పదవి విరమణ పొందిన ఇంజనీర్ ఈఅండ్ఎం వెంకటరమణ,జిఎం పిఏ.ప్రసాద్,జిఎం కార్యాలయ జూనియర్ అధికారి సముద్రాల బుచ్చయ్యలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ...సుదీర్ఘకాలంగా సింగరేణికి సేవలు అందించిన అధికారులు పదవీ విరమణ పొందడం బాధాకరమైనప్పటికీ ప్రతి అధికారికి పదవి విరమణ తప్పదని అన్నారు.పదవి విరమణ పొందిన అధికారులు ఏరియాలో విశేష సేవలు అందించి అధికారుల కార్మికుల ఆదరాభిమానాలు చూరగొన్నారని వారి సేవలను ఆయన కొనియాడారు.వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో సాగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం. విజయ్ ప్రసాద్,పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్,జిఎం కార్యాలయ పిట్ సెక్రటరీ గీతిక, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులతో టిఫిన్ చేసిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు..



**రామయంపేట,జూన్30 (సూర్యరేఖ)** రామయంపేట పట్టణంలోని ఓ స్థానిక హోటల్లో స్థానికులతో కలిసి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు టిఫిన్ చేయడం జరిగింది.స్థానిక హోటల్ పూరి టిఫిన్లకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ హోటల్ లో ఎమ్మెల్యే రోహిత్ రావుతో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజాగౌడ్, టిఫిన్లు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అందరిలో కలుపుగోలుగా ఉండడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించండి

**సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు**

**ఎస్సై ఎస్.రాజశేఖర్**



**మందమర్రి,జూన్30 (సూర్య రేఖ)** సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని పట్టణ ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. రెచ్చగొట్టే పోస్టుల వల్ల సమాజంలో అశాంతి అల్లర్లు జరిగే అవకాశం ఉందని,దీనివల్ల ప్రజల ప్రాణాలకు ఆస్తులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని,అందుచేత ఇలాంటి పోస్టులను తీవ్రంగా పరిగణిస్తున్నామని వారు తెలిపారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల మధ్య కుల,మత, ప్రాంతీయ విద్వేషాలు రగిలించేలా ఉండే పోస్టులు వీడియోలు ఫోటోలు దుష్ప్రచారాలు ప్రచారం చేయడం చట్ట విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.ఫేస్ బుక్,ట్విట్టర్,ఇంస్టా గ్రామ్,వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచే విధంగా పెట్టే పోస్టులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. తెలియని వీడియోలు, ఫోటోలు ఎటువంటి ధృవీకరణ లేకుండా షేర్ చేసినా,ఫార్వర్డ్ చేసినా కఠిన చర్యలు తప్పవని,సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.గ్రూపులో నిరాధార పోస్టులు ఫార్వార్డ్ చేస్తే సంబంధిత వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.సోషల్ మీడియా లో ఎవరినైనా వేధించడం బెదిరించడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. అనుమానస్పద లింకులను క్లిక్ చేయకూడదని ఫేక్ అకౌంట్ లను ఉపయోగించకూడదని సూచించారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా సమాజంలో శాంతి సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పడానికి సహకరించాలని కోరారు.

# ఎర్రబోడలో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని తీర్మానం

**శ్రీసప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గుమ్మకొండ మధుసూదన్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎర్రబోడలో అంబేద్కర్ ప్రజా భవన్ నిర్మాణానికి తీర్మానం చేయడం జరిగిందని శ్రీసప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గుమ్మకొండ మధుసూదన్ రెడ్డి తెలిపారు.శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శివాలయం పునర్నిర్మిత కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా శ్రీసప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గుమ్మకొండ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికంగా దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు,పౌర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ ఎర్రబోడ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో విశాలమైన రీతిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరిట ప్రజా భవన్ నిర్మించాలని రాజకీయ పార్టీలు,పౌర సంఘాలు నిర్ణయించాయి.అంబేద్కర్ భవన్ ఎస్సీలతో పాటు పేదలకు అండగా,స్థానికులకు నీడగా ఉండే విధంగా రూపొందించాలని తీర్మానం చేశారు.ఎర్రబోడలో సర్వేనెంబర్ 7లో ఉన్న 33 గుంటల స్థలంలో విశాలంగా అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.గతంలో ఇక్కడ దళిత సంఘాల కోసం ప్రభుత్వం కొంత భూమిని కేటాయించిందని,కొన్ని కారణాలవల్ల ఈ స్థలం చాలా కాలంగా ఉపయోగంలోకి రాలేదన్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు,పౌర సంఘాలన్నీ ఏకతాటిపై కలిసి రావడంతో విశాల భవనం నిర్మాణంపై ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి,మ్యాడం రామేశ్వర్‌రావు నారగూడెం మల్లారెడ్డి,మోంద్ర కొముర య్య కల్లు గోపాల్ వనం నర్సింహా సోమారం రవీందర్ సోమారం రాజ్ కుమార్ సాబాద విజయ్ కుమార్ పౌర సంఘాల ప్రతినిధులు గుమ్మకొండ పెంటారెడ్డి మేడం మధుసూదన్,పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి కోడిగంటి బాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నేడు రామాయంపేటలో రూ.7.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చౌదరిసుప్రభాతరావు వెల్లడి..**



**రామాయంపేట,జూన్30(సూర్యరేఖ)** రామాయంపేట పట్టణంలో మంగళవారం రూ 7.5 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహితరావ్ శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.బస్సు స్టాండ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటితో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే ఉప్పరి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.8లక్షలు,5వ వార్డులో హెచ్ పి పెట్రోల్ పంపు ప్రక్కన మురికి కాలువలు,సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు,5వ వార్డు రెడ్డికాలనీలో మురికి కాలువ,సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి, అదే 5వ వార్డు రెడ్డికాలనీ లో పంచముఖి హనుమాన్ ఆలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5లక్షలు పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.8 లక్షలు మల్లన్న ఆలయం వద్ద యాదవ సంఘం కమ్యూనిటీ హల్ నిర్మాణానికి రూ.10లక్షలు,5వ వార్డులో మంజీర స్కూల్ వద్ద మురికి కాలువలు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి,రజక సంఘం వద్ద (సిద్దిపేట రోడ్)కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.8లక్షలు 1వ వార్డులో మురికి కాలువలు,సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.70లక్షలు ఇందిరమ్మ విగ్రహం నుండి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వరకు మురికి కాలువలు,సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి, 1వ వార్డులో స్కూల్ వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపనకు రూ.లక్షలు,(మాదిగ వాడ)1వ వార్డులో పోచమ్మ ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి (మాల వాడ) రూ.8లక్షలు,మార్కండేయ మందిరం (పద్మశాలి సంఘం)వద్ద షెడ్ నిర్మాణం కోసం రూ.5లక్షలు మున్నూరు కాపు సంఘం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపనకు రూ.8లక్షలు కేటాయించడం జరిగిందని,ఈ పనులన్నింటికీ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి పనులన్నీ రెండు మూడు రోజుల్లో ప్రారంభమౌతాయన్నారు.

# కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి

**గుర్తింపు సంఘంతో 7వ స్ట్రక్చర్ మీటింగ్**

**జిఎం.దేవేందర్**

**మందమర్రి,జూన్ 30(సూర్యరేఖ)** మందమర్రి ఏరియాలోని సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏరియా జిఎం జి.దేవేందర్ అన్నారు. సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్ లో ఏరియా జిఎం జి.దేవేందర్ అధ్యక్షతన గుర్తింపు సంఘం (ఏఐటియుసి)యూనియన్ తో 7వ స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో గడిచిన స్ట్రక్చర్ సమావేశంలో జరిగిన పనుల పురోగతిపై చర్చించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకువచ్చారు. కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిస్పెన్సరీలలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని,గనులలో కార్మికుల రక్షణ పరికరాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నాణ్యమైన పనిముట్లను, అందచేయాలని కార్మికులు ఉండే గృహాలను మరమ్మతులు చేపట్టి నాణ్యమైన విద్యుత్ సౌకర్యం అందించేలా చర్యలు చేపట్టాలని,ఏరియాలోని గనుల్లో కార్మికుల ఇబ్బందులనువెంటనే పరిష్కరించాలని వారు కోరారు.అనంతరం జిఎం జి. దేవేందర్ మాట్లాడుతూ...గుర్తింపు సంఘం నాయకులు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించి కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఇప్పటి వరకు ఏవిధముగా ఉత్పత్తి లక్ష్య సాధనలో సహకరించారో ఇక ముందు కూడా అలాగే సహకరించాలని వారిని కోరారు.కార్మిక సంఘం నాయకులు కార్మికుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి తగిన కృషి చేస్తానన్నారు.సంస్థ అభివృద్ధిలో ఉత్పత్తి ఉత్పాదకతలో కార్మిక సంఘాల పాత్ర చాలా కీలకమైనదని సింగరేణి సంస్థ ఉత్పత్తి,ఉత్పాదకత లోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ఎక్కువ ప్రదాన్యతను ఇస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో ఎస్ఓటు జిఎం.విజయ ప్రసాద్,



మందమర్రి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్,ఏరియా ఇంజనీర్ వెంకటరమణ వర్క్ షాప్ డివైజియం దూపూసింగ్,డాక్టర్ నాగేశ్వరరావు, ఎస్కే గ్రూప్ ఏజెంట్ ఖాదీర్,ఐఈడి ఎస్ఈ కిరణ్ కుమార్,సివిల్ ఎస్ఈ రాము రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్ సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం ఏరియా నాయకులు సివి.రమణ సీనియర్ అధికారులు ఏఐటీయూసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్..



**కొల్చారం,జూన్30(సూర్య రేఖ):**నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ వరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు.కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన పాత్లోత్ అరుణకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.13 వేల చెక్కును అందజేశారు. కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామానికి చెందిన దూదేకుల మౌలానీకి రూ.12,500 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అందజేశారు.

## పిజెటిఏయు ఉద్యోగుల పదవి విరమణ..



**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేస్తున్న నాగమణి,డ్రైవర్ గా పనిచేస్తున్న కిష్టయ్య,లు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ఘనంగా సన్మానించారు.సుదీర్ఘకాలం చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.వీరిద్దరూ అంకితభావం, నిబద్ధతతో విశ్వవిద్యాలయానికి సేవలు అందించారన్నారు.కష్టపడి పనిచేసే వారికి ఎప్పుడు గుర్తింపు లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ జాయింట్ రిజిస్ట్రార్ శివాజీ, విశ్వవిద్యాలయం అధికారులు,బోధన,బోధనేతర సిబ్బంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు,నాగమణి, కిష్టయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి..

**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి,ఏజీఎం నితిన్ కుమార్ మలాట్కర్,లు**





**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)** ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి సాటి మనిషి ప్రాణాలను కాపాడాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ సిహెచ్ వేణుగోపాల్ రెడ్డి,ఏజీఎం నితిన్ కుమార్ మలాట్కర్,లు అన్నారు. సోమవారం ఎస్‌బీఐ,ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు.ఎస్‌బీఐ సిబ్బంది,యూనివర్సిటీ బోధన,బోధనేతర విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సుమారు 100 యూనిట్ల రక్తాన్ని ఎంఅండ్ జే ప్రభుత్వ క్యాన్సర్ హాస్పిటల్ కు సమకూర్చారు.ఈ సందర్భంగా గోవర్దన్ మాట్లాడుతూ. రక్తదానం ఆవశ్యకత,తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోషకాహారం గురించి విద్యార్థులకు వివరించారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతో మందికి రక్తదానం అవసరమవుతుందని,ఇంతటి మహత్కార్యాయంలో విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
మంగళవారం 1 జూలై 2025

# అటెండర్లుగా పదోన్నతి కల్పించాలి





తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డిని వర్కర్స్

**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)** రంగారెడ్డి జిల్లా గ్రంథాలయం సంస్థలో పని చేస్తున్న తమకు అటెండర్లుగా పదోన్నతి కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డిని వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ. దాదాపు 30 సంవత్సరాలుగా పని చేస్తున్నామని,గతంలో తమలాగే పని చేసిన వారికి జీవో నెంబర్ 212,112 ప్రకారం రెగ్యులరైజేషన్ చేశారన్నారు.రాష్ట్రంలో పార్ట్ టైం వర్కర్లుగా పని చేస్తున్నామని,లాస్ట్ గ్రేడ్ తీసుకుంటున్నామన్నారు. చాలీచాలని జీతాలు పొందుతున్నందున ఆర్థికంగా కుటుంబంపై భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్నత నిత్యవసర వస్తువుల ధరలు పెరుగడంతో తమకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.కావున తమను జీవోనెంబర్ 212,112 ప్రకారం రెగ్యులరైజ్ చేయించాలని కోరామన్నారు.

# పత్రికా స్వేచ్ఛను హరిస్తే..సహించే ప్రసక్తే లేదు...





టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస శర్మ

**రామాయంపేట,జూన్30(సూర్య రేఖ)** పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా దాడులు చేస్తే ఊరుకునేది లేదని టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి శ్రీనివాస శర్మ అన్నారు.మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం జర్నలిస్టు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మహాటీవీ ఛానల్ పై బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాడి చేసి,ధ్వంసం చేయడానికి నిరసిస్తూ నిరసన చేపట్టారు.స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద దాడికి నిరసనగా ఆందోళన చేపట్టారు.మీడియా జోలికి వస్తే ఖబర్దార్ ఖబర్దార్. బీఆర్ఎస్ గుండాలను అరెస్టు చేయాలంటూ పెద్దపెట్టిన నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన జర్నలిస్టులు తహశీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం సమర్పించారు. మహాటీవీ ఛానల్ పై దాడి చేసిన బీఆర్ఎస్ నాయకులపై హత్య నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. మహాటీవీ కార్యాలయంపై దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని శ్రీనివాస శర్మ హెచ్చరించారు. జర్నలిస్టు జేఏసీ మండల అధ్యక్షులు బసన్నపల్లి మల్లేష్ యాదవ్,మాజీ అధ్యక్షులు మద్దెల సత్యం మాట్లాడుతూ. మీడియా పై దాడులు సహించరానివని పేర్కొన్నారు. మహాటీవీ కార్యాలయం దాడి చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పటేరి రాము,జర్నలిస్టులు చంద్రపు అమరేందర్ రెడ్డి,పాతూరి రమేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,కర్రె నరేందర్,రామారపు యాదగిరి తుజాల శ్రీనివాస్ గౌడ్ రామచంద్రారెడ్డి సార్గూ నర్సింలు శ్రీరామ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ డే- కేర్ సెంటర్ ను ప్రస్తుత భవనంలోనే కొనసాగించాలి

జిల్లా తెలంగాణ వయోవృద్ధుల సంరక్షణ కేంద్రం కమిటీ నాయకులు

**మంచిర్యాల,జూన్30(సూర్యరేఖ)** రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల కోసం తాజాగా ఏర్పాటు చేయబోయే సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్ ను మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న భవనంలోనే కొనసాగించాలని మంచిర్యాల జిల్లా తెలంగాణ వయోవృద్ధుల సంరక్షణ కేంద్రం కమిటీ నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సముదాయంలో వినతి పత్రం అందించిన అనంతరం కమిటీ నాయకులు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల కోసం తాజాగా ఏర్పాటు చేయబోయే సీనియర్ సిటిజన్స్ డేకేర్ సెంటర్ ప్రస్తుతం కలెక్టర్ )ఆధీనంలో ఉన్నదని ప్రస్తుతానికి వయో వృద్ధులమైన మేమే నిర్వహించు కొనుచున్నామని,ఈ ప్రస్తుత భవనంలోనే ఏర్పాటు చేసి యధావిధిగా కొనసాగించాలని కోరారు.2017 లో మంచిర్యాల జిల్లాలో అప్పటి జిల్లా కలెక్టర్,ఇతర ఉన్నతాధికారులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయవృద్ధులకు అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కాలేజి రోడ్డులో గల స్థలంలో డే -కేర్ సెంటర్ భవనంను కేటాయించారని, 2017 నాటికి మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న ఈ డే-కే సెంటర్ లో సభ్యుల సంఖ్య 800,ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 2200 వేలకు చేరిందని,ఈ డే- కేర్ సెంటర్ ను నిర్వహించుకోవడానికి వయోవృద్ధులము అందరం కలసి ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి కాలంలో సుమారు ఎనిమిది నెలలపాటు ఇక్కడ ఎలాంటి నిర్వహణ లేకపోవడం వల్ల పచ్చదనంతో కూడిన చెట్లు ఎండిపోయాయని, రెండు బోరింగ్ మోటర్ పంపులు చెడిపోయి, శిథిలావస్థకు చేరుకున్నాయని,వాటిని తిరిగి యధాశక్తికి తీసుకురావాలనే పట్టుదలతో తాము ఉన్నామని తామంతా ఆర్థికంగా వెనుకబడి ఉన్నా కూడా,పట్టు వీడకుండా సభ్యులందరం కలిసి చందాలు వేసుకొని గతంలో మాదిరిగా అన్ని సౌకర్యాలతో కూడిన వాతావరణాన్ని ఇప్పుడు కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.ఇందుకోసం ఇప్పటి వరకు దాదాపు ఒక లక్ష రూపాయల వరకు ఖర్చు అయిందన,ఈ అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు.తాజాగా మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వయోవృద్ధుల కోసం అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయబోయే సీనియర్ సిటిజన్స్ సెంటర్ ల ప్రతిపాదనలో మంచిర్యాల జిల్లాలో కూడా ఈ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సీనియర్ సిటిజన్స్ సెంటర్ ను ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలోనే కొనసాగించాలని



మంచిర్యాల జిల్లా సీనియర్ సిటిజెన్ కార్యవర్గ సభ్యులు,అలాగే జిల్లా వయోవృద్ధులం అందరం కలిసి జిల్లా కలెక్టర్ ను కోరగా వారు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా తెలంగాణ వయోవృద్ధుల సంరక్షణ కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు నడిపెల్లి వెంకటేశ్వరరావు ఈలపంటి మహేందర్ రాజు కోశాధికారి రాపోలు హనుమంతరావు,సహా అధ్యక్షుడు పానుగంటి పోచయ్య,గౌరవ అధ్యక్షులు బొలిశెట్టి రాయలింగు, ముఖ్య సలహాదారు రాళ్లబండి రాజన్న,కార్య నిర్వహక కార్యదర్శులు రికుల రాజిరెడ్డి,కే.దేవిదాస్, ఉపాధ్యక్షులు బోనగిరి కృష్ణ,కార్యదర్శి కే. మధుసూదన్ రెడ్డి,జాయింట్ కార్యదర్శి సిహెచ్. ప్రభాకర్,కార్యవర్గ సభ్యులు జగ్గారావు,కే. నారాయణ ఎస్.. రాజయ్య టి.రాజయ్య,సిహెచ్. పాపారావు,ఎ.రవీందర్ రావు,కే మల్లేష్మ,వి.జగత్ ప్రకాష్ రావు,కే బాబురావు ఏ.రాజయ్య,ఏం. భాస్కరరావు లింగమూర్తి శ్రీరాములు,తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంతో నడుపుతూ నిండు ప్రాణాలు బలి..

-ఘటన స్థలాన్ని పరిశీలించిన మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి..



**కొల్చారం,జూన్30(సూర్య రేఖ)** మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మంబోజి పల్లి గ్రామ శివారులోని నిజం షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆర్టీసీ బస్సు ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (26),కౌడిపల్లికి చెందిన నరేష్ (25)లు ఆటోలో మెదక్ వస్తున్నారు.ఆటో నడుపుతున్న శ్రీకాంత్ ఎన్ఎస్ఎఫ్ ముందుగా వెళ్తున్న బైకును ఓవర్ టేక్ చేసేందుకు ఆటో వేగం పెంచి నడిపాడు కానీ ముందుగా వస్తున్న ఆర్టీసీ బస్సును చూడకపోవడంతో దాన్ని ఢీకొట్టాడు రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో బస్సును ఢీ కొట్టి నుజ్జు నుజ్జు అయింది. అందులో ఉన్న శ్రీకాంత్ నరేష్ లు అక్కడికక్కడే మృతి చెందారు.విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను మెదక్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

## నిరుపేదల సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ పార్టీ



**కామారెడ్డి,జూన్30(సూర్య రేఖ)** నిరుపేదల సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కామారెడ్డి జిల్లా మహిళా జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి రవి ప్రసాద్ అన్నారు.రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని ఆమె గుర్తు చేశారు.అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని ఆమె అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమలవుతున్న రాష్ట్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా డబ్బులు ప్రభుత్వం చెల్లించిందని ఆమె గుర్తు చేశారు.నిరుపేదలకు సన్న బియ్యం పంపిణీ చేసి పేద ధనిక తేడా లేకుండా ఒకే రకమైన భోజనం అందిస్తున్న పార్టీ ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆమె గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం పేద ప్రజల కోసం ఆలోచన చేస్తున్నాడని,అందుకే ఇందిరమ్మ ఇండ్లు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తూ దేశానికే రోల్ మోడల్ గా తెలంగాణ రాష్ట్రాన్ని తయారు చేశారని ఆమె అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## మేయర్ విజయలక్ష్మి చేతులమీదుగా కప్పు అందజేత



**నాంపల్లి,జూన్30(సూర్యరేఖ)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీలో జియాగూడ కార్పొరేటర్ బొహిని దర్శన్ కార్పొరేటర్ల టీమ్ నాగోల్ డిఆర్ఎఫ్ క్రికెట్ క్రీడా మైదానంలో జీహెచ్ఎంసీ క్రికెట్ క్రీడా ఇంచార్జ్ రఘుపతి సారథ్యంలో జరిగిన పోటీలో విజయం సాధించారు.ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి చేతులమీదుగా కప్పు అందజేసారు.బోహిని దర్శన్ కు కప్పు అందజేసిన వారిలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి,టౌన్ ప్లానింగ్ డీసీ శశిరేఖ పాల్గొన్నారు.

# శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం











**వర్షం పడితే తడిసిపోతున్న రికార్డులు..**
**పాతవి శిథిలం..కొత్తవి పూర్తికాని నిర్మాణం..**
**భయం గుప్పెట్లో అధికారులు..**

**రామాయంపేట,జూన్30(సూర్యరేఖ)**
రామాయంపేట తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది.గతంలో నుండి ఈ కార్యాలయం శిథిలావస్థకు చేరి పెచ్చులూడి కింద పడడంతో పాటు కార్యాలయానికి వచ్చిన వారిపై కూడా పెచ్చులూడి పడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి.గతంలో కొత్త కార్యాలయం నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేశారు.అయితే అప్పట్లో తూతూ మంత్రంగా నూతన తహసీల్దార్ కార్యాలయం కొత్త భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది.అయితే ఆ నిర్మాణ పనులు కేవలం సగం వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేయడం జరిగింది.దీంతో గత్యంతరం లేక పాత కార్యాలయంలోని అధికారులు విధులు నిర్వహించడం జరుగుతుంది.కాగా ఇటీవల గత కొద్ది రోజుల క్రితమే అధికారులతో పాటు కార్యాలయానికి వచ్చిన ప్రజలపై కూడా పెచ్చులూడి పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.దీంతో కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులతో పాటు అక్కడికి వచ్చిన ప్రజలు కూడా భయం గుప్పెట్లో ఉంటున్నారు.అంతేకాకుండా విలువైన రికార్డులకు సంబంధించిన కాగితాలు సైతం వర్షాకాలంలో తడిసి ముద్ద అవుతున్నాయి. అంతేకాకుండా కొన్ని సందర్భాల్లో అత్యవసర అవసరం ఉన్న కాగితాలు సైతం దొరకని పరిస్థితి నెలకొంది.ఇటీవల కాలంలో భూములకు సంబంధించి ఎన్నో సమస్యలు వస్తున్నాయి. ఇటువంటి తరుణంలో గత 30 నుండి 50 ఏళ్లకు సంబంధించిన పాత రికార్డులు ఆన్లైన్ కాక రాతపూర్వకంగా ఉన్న రికార్డులను అడిగితే ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం-తహసీల్దార్ రజనీకుమారి**

ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయం గురించి ఉన్నత అధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.పాత కార్యాలయం శిథిలావస్థకు చేరి కూలీన పరిస్థితిలో ఉన్న విషయం గురించి వివరించాం.అంతేకాకుండా అసంపూర్తిగా ఉన్న నూతన కార్యాలయ పనుల గురించి కూడా నివేదించడం జరిగింది.కార్యాలయానికి వచ్చే సిబ్బందితో పాటు ప్రజలు కూడా అందరూ సురక్షితంగా ఉండాలని అనుకుంటున్నాం.

**ఇంత నిర్లక్ష్యం ఎందుకు...రైతు..వెంకట్ సుతార్పల్లి..**

నాకు ఊహ తెలిసినప్పటి నుండి తహసీల్దార్ కార్యాలయం అక్కడే ఉంది.కనీసం దానిని ఇప్పటివరకు మరమ్మత్తులు చేసిన సంఘటనలు లేవు.తూతూ మంత్రంగా కొత్త భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు.అది కూడా అసంపూర్తిగా వదిలేశారు.దీంతో పాత కార్యాలయంలోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారు.ప్రతిసారి పెచ్చులూడి పడడంతో ప్రాణపాయ స్థితిలో జంకుతున్నాం.విషయంలో అధికారులతో పాటు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# వయస్సు మరచి ఆనందంగా గడిపిన చిన్న నాటి స్నేహితులు






**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)**చిన్ననాడు కలిసి చదువుకున్నారు ...40 సంవత్సరాల తర్వాత నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆడి. పాడారు. వయస్సును మరచి ఆనందంతో గంతులు వేశారు.తమ మధురానుభూతులను జ్ఞాపకం చేసుకున్నారు. తమతో పాటు చదువుకున్న విద్యార్థులలో ఎం. శ్రీనివాస్ యాదవ్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంకు నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షునిగా,మరో విద్యార్థి మహమ్మద్ షర్ఫుద్దీన్ పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా,వై.శ్రీదర్ అనే విద్యార్థి బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా,ఎం.కాశీ విశ్వనాధ్ గౌడ్ తెలంగాణ గౌడ సంక్షేమ సంఘానికి రాష్ట్ర కోశాధికారిగా వేముల చక్ర పాణి మిథుబుషి కంపెనీకి సౌత్ ఇండియా హెడ్ గా, మరో విద్యార్థి పి.మహేశ్వర్ ప్రముఖ టూల్స్ కంపెనీలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా,శివకుమార్ అనే విద్యార్థి సీబీఐలో అధికారిగా పనిచేస్తుండడం, జయశ్రీ,లక్ష్మీలు టీచర్లుగా రాంబాబు యాదవ్ విద్యాసంస్థను నెలకొల్పి పలువురికి ఉపాధి కల్పిస్తుండడం సయ్యద్ హిదాయతుల్లా షఫీ రియల్టర్ గా,సామ సుమన్ రెడ్డి వ్యాపారిగా తాము చేస్తున్న పనుల గురించి ఒకరికొకరు చెప్పుకొని సంతోషపడ్డారు. వీరితోపాటు అనేకమంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగులుగా స్థిరపడిన విధానాన్ని చెప్పుకొని స్నేహితులతో సంతోషంగా గడిపారు. తాము అంతగా చదువుకోకపోయినా, తమ పిల్లలను ఉన్నతంగా చదివించుకోగలిగామని అందరి ముందు ఆనందంగా తెలియజేశారు. దోస్త్ మేరా దోస్త్ అనే పాటపై అందరూ కలిసి నృత్యం చేశారు.ఆత్మీయ సమ్మేళనంలో ఎం.రాంబాబు యాదవ్ దంపతులు చేసిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.స్నేహానికి ఉన్న విలువ ప్రపంచంలో మరేదానికి లేదని ఈ ఆత్మీయ సమ్మేళనం నిదర్శనంగా నిలిచిందని చెప్పవచ్చు..

## ఆపరేషన్ సిందూర్ విజయ యాత్ర దేశభక్తి ప్రదర్శనకు అద్భుత వేదిక..

**రాజేంద్రనగర్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జూన్30(సూర్యరేఖ)** ఆపరేషన్ సిందూర్ విజయ యాత్ర దేశభక్తి ప్రదర్శనకు అద్భుత వేదికగా నిలుస్తుందని రాజేంద్రనగర్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి అన్నారు.సోమవారం శ్రీవిద్యారణ్య ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయ యాత్ర ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు.8వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు దేశభక్తి ఏకత్వం,సామాజిక బాధ్యతతో నిండిన ఉత్సాహంతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థుల్లో దేశసేవ పట్ల గౌరవాన్ని,పౌరజ్ఞానాన్ని పెంపొందించిందన్నారు.ర్యాలీ ప్రారంభం పాఠశాల ఆవరణలో జాతీయ గీతంతో ప్రారంభమై,సమీప కాలనీల్లో శాంతియుతంగా సాగిందన్నారు.విద్యార్థులు ముద్రితపత్రములు (ప్లకార్డులు),నినాదాలతో ప్రజల్లో చైతన్యం కలిగించారు.పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్ భాస్కరభట్ల కమిటీ సభ్యుడు వెంకటస్వామి ఉపాధ్యాయ బృందం సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.విద్యార్థులు జాతీయ సమైక్యత సామాజిక సమగ్రత,పౌర బాధ్యతలపై చర్చలు జరిపారు.ఈ ర్యాలీ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,ధైర్యం,సామాజిక చైతన్యం వంటి విలువలను పెంపొందించేందుకు దోహదపడింది.భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులపై తమకు గర్వంగా ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు హిమాయత్ సాగర్ లో విద్యుత్ సరఫరాల అంతరాయం..



**బండ్లగూడ,జూన్30(సూర్యరేఖ)** హిమాయత్‌సాగర్ విద్యుత్ సెక్షన్లో కొత్త ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు,ఇతర నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్ తెలిపారు.సెక్షన్ పరిధిలోని గంధం గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం1:30 గంటల నుండి.17:30 గంటల వరకు కాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన సింధులోయ,సంజయ్ గాంధీనగర్,భవానీ కాలనీ, బైరాగిగూడ,శివ సాయినగర్ సుబ్రహ్మణ్యకాలనీ, రంగారెడ్డికాలనీ,దత్తాత్రేయకాలనీ,వాల్మీకోని, గంధంగూడ గృహాలు,

**-వాంటేజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..**

వనటేజ్ కాంప్లెక్స్,ప్రక్కనే ఉన్న విల్లాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయం కోసం సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు ఉత్తమ గురువు ఉపాధ్యాయుడే

**జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రాధాకిషన్**



**చేగుంట,జూన్30 (సూర్యరేఖ)** మండలంలోని చందాయిపేటలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు కే.అజిత (సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు) పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ మాట్లాడుతూ...ఉత్తమ ఉపాధ్యాయులకు సమాజంలో ఎప్పుడు గుర్తింపు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్,మండల విద్యాధికారి నీరజ,నార్సింగి మండల విద్యాధికారి గంగుబాయి,కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అమర్ శేఖర్ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సంతోష,వివిధ సంఘాల జిల్లా,మండల నాయకులు చల్లా లక్ష్మణ్, వెంకట్రాంరెడ్డి,రాజగోపాల్ గౌడ్,వరాల నర్సింలు,విట్టల్ రెడ్డి,రంగా రెడ్డి, జనార్దన్ రెడ్డి,రావుల వెంకటేష్,మనోహర్ రావు,పెంటాగౌడ్ కృష్ణమూర్తి, నరసింహ రావు,బాల పోచయ్య,తిరుపతిరెడ్డి,చల్లా రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.


## స్కావెంజర్ల,అటెండర్ ల కోసం దరఖాస్తుల ఆహ్వానం



**చేగుంట,జూన్30(సూర్యరేఖ) :** చేగుంట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో స్కావెంజర్స్ గా,అటెండర్ లుగా పనిచేయుటకు ఆసక్తి ఉన్న వారిని ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారిని శ్రీవాణి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె సోమవారం సూర్య రేఖ ప్రతినిధితో మాట్లాడుతూ..స్కావెంజర్స్ నియామకానికి ఏడవ తరగతి అర్హత కలిగిన మహిళలు,అటెండర్ నియామకానికి పదవ తరగతి అర్హత కలిగిన మహిళలు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.ఈ నియామకం విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే 7660931789 నంబర్ కు కాల్ చేయాలని సూచించారు.

# బెల్లంపల్లి ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజావాణి







వినతిపత్రం అందచేసిన బట్వాన్ పల్లి గ్రామప్రజలు

**బెల్లంపల్లి,జూన్30(సూర్య లేఖ)**బెల్లంపల్లి మండలం బట్వాన్ పల్లి గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా గ్రామంలో తరతరాలుగా అన్ని రకాల పండుగలు గ్రామ సమస్యలపై చర్చలకు వాడుతున్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ముందు గల భూమి కబ్జాకు గురైనందున అట్టి భూమిని కబ్జా నుండి స్వాధీనం చేసుకుని మళ్లీ గ్రామ అవసరాలకు కేటాయించాలని తాళ్లగురిజాల నుండి బట్వాన్ పల్లికి వచ్చే రహదారికి ఇరువైపుల దట్టమైన ముళ్ల చెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నందున ఆ ముళ్ల చెట్లను తొలగించాలని,గ్రామంలో వీధిలైట్లు,పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేనందున ప్రజలు ప్రమాదాలకు,అనారోగ్యానికి గురవుతున్నందున వాటిని సక్రమంగా నిర్వహించాలని,గ్రామంలో పిచ్చికుక్కల బెడద ఎక్కువై ప్రజలపైన దాడులు చేస్తున్నందున వాటి బెడతను శాశ్వతంగా తొలగించాలని గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ సీజన్ మొదలైనందున రోడ్లపై కేజీ వీల్స్ తిరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్ గౌడ్,సదువుల వెంకటరమణ గోమాస వినోద్ కుమార్,దుర్గం హరికృష్ణ,రత్నం జనార్దన్,రత్నం మల్లేష్,సెల్వటికారి రాజేంద్ర ప్రసాద్,చల్లూరి వెంకటేష్,చల్లూరి రాజ్ కుమార్ పాగిడి మోహన్,పాగిడి శ్రీకాంత్,దుర్గం రాజేష్ దుర్గం ప్రసాద్,గోమాస వెంకటరమణ గోమాస వీర్ తదితరులు పాల్గొన్నారు.

# మొద్దు నిద్రలో మాసాయిపేట మండల విద్యాశాఖ అధికారిని లీలావతి

- ప్రైవేటు పాఠశాలల్లో కళ్ళు చెదిరే ఫీజులు
- జీవో 1కి తూట్లు
- అడ్డగోలుగా ఫీజుల వసూలు
- అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం
- నిబంధనలకు నీళ్లు..లక్షల ఫీజులు వసూళ్లు..
- చదువు కొనలేక..తల్లిదండ్రుల విలవిల
- ప్రైవేట్ విద్యాసంస్థల ఇష్టారాజ్యం
- ఉదాసీన వైఖరిలో మండల విద్యాశాఖ అధికారిని లీలావతి



విద్యా దందా కోరలు చాచింది.రోజురోజుకి విస్తరిస్తున్న కార్పొరేట్ స్కూళ్లు వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నాయి.దోపిడీ కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల ధనదాహం తల్లిదండ్రుల్ని పీల్చి పిప్పిచేస్తోంది.డబ్బే ధ్యేయంగా విద్యా విలువల్ని తుంగలోకి తొక్కేస్తున్నారు.ఎల్కేజీ అడ్మిషన్లకే రూ.లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్కూళ్లలో కనీస సౌకర్యాలు సైతం ఉండవు.పాఠశాలలో విద్యార్థులు ఆడుకోడానికి సరైన ప్లే గ్రౌండ్ ఉండదు. పిల్లలు స్కూల్లోనే తినాలి. దీనికి అదనంగా డబ్బులు చెల్లించాలి.ఒక్క ఫీజుతోనే సరిపోదు ఫీల్డ్ ట్రిప్,ప్రాజెక్టు వర్క్,స్పోర్ట్స్,లాబ్స్,లైబ్రరీ అంటూ అదనపు ఫీజులు వసూలు చేస్తారు.వీటికి రశీదులు కూడా ఉండవు.మాసాయిపేట మండలంలోని ప్రైవేట్ స్కూళ్లలో దోపిడీ ఈ విధంగా కొనసాగుతోంది.

**మాసాయిపేట ప్రతినిధి,జూన్30(సూర్యరేఖ) :** చదువే వ్యాపారకేంద్రాలుగా తమలాగే తమ పిల్లలు కష్టపడొద్దు. చదువులకు ఎంత ఖర్చైనా ఫర్వాలేదు.వారిని మంచి చదువులు చదివించి ఉన్నత స్థానాల్లో నిలపాలనుకుంటున్న తల్లిదండ్రుల ఆశలను మాసాయిపేట మండలంలోని ప్రైవేటు కార్పొరేట్ స్థాయి బడులు సొమ్ము చేసుకుంటున్నాయి.వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మానసికంగా ఆందోళనకు గురి చేస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి నిబంధనలు పాటించడం లేదు.ఇంత జరుగుతున్నా విద్యాశాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం,మండల విద్యాశాఖ అధికారి సదరు పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడం ఆందోళన కలిగించే విషయం.6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలంతా బడిలో చేరి ఉచితంగా చదువుకోవాలనే ఉద్దేశంతో 2009 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యా బాలల హక్కు చట్టం రూపొందించింది.ఎంతో ఉన్నతమైన ఈ చట్టం అపహాస్యం అవుతోంది.ఈ విషయాన్ని అధికారులు మరిచిపోవడం విస్మయానికి గురిచేస్తోంది.ప్రవేటు విద్యాసంస్థలకు జీవో నెంబర్ 1 ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్ల క్రితం జారీ చేసిన జీవో నంబర్ 1 అటకెక్కింది.పదేళ్ల క్రితం మండలంలో ఒకటి రెండు మాత్రమే ప్రైవేట్ విద్యా సంస్థలు ఉండగా ప్రస్తుతం వీధికొకటి వెలిశాయి.పాఠశాల విద్యను శాసించే స్థాయికి వీటి కార్యకలాపాలు విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. మాసాయిపేట మండల కేంద్రంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఎల్కేజీ,యూకేజీలకు ఏడాదికి రూ.30 వేల వరకు ఫీజు వసూలు చేస్తుండటం గమనార్హం. పుస్తకాలు యూనిఫాం అవసరం ఉన్నా లేకున్నా పాఠశాలల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అదనంగా మరో రూ.10 వేలు ఖర్చవుతోంది.వీటితో పాటు పుస్తకాలు,ఇతర ఖర్చులకు రూ.20 వేలు వసూలు చేస్తున్నారు.స్థానికంగా పేరుగాంచిన పాఠశాలల్లో ఫీజులు వింటే తల్లిదండ్రులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి.అడ్మిషన్లు పేరిట యథేచ్ఛగా డొనేషన్లు వసూలు చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు.తరగతిని బట్టి అడ్మిషన్ ఫీజు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటోంది. వాస్తవానికి ఈ ఫీజును పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీలో చర్చించి అనుమతి తీసుకోవాల్సి ఉంది.దానిని డీఈవో దృష్టికి తీసుకెళ్లి వసూలు చేసుకోవాలనే నిబంధన ఉంది.ఎక్కడా ఈ నిబంధనలు అమలుకు నోచుకోవడం లేదు. మాసాయిపేట మండలంలోని కొన్ని పాఠశాలలకు మైదానాలు,పార్కింగ్ స్థలాలు లేవనేది అధికారులకు తెలియనిది కాదు. విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంలోనూ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నాయి. అర్హులైన బీఈడీ,డీఈడీ ఉపాధ్యాయులు,ఎంఈడీ చేసిన ప్రధానోపాధ్యాయులను నియమించాల్సి ఉన్నా ఎక్కడా వీరి ఊసేలేదు.

## దుబాయ్ వేదికగా 'వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్'..

## ఫిబ్రవరిలో తొలి సీజన్..!

ఐపీఎల్ రాకతో పొట్టి క్రికెట్ దశ మారినట్టే అన్ని ఆటల రూపరేఖలు కూడా మరిపోతున్నాయి. ఇంతకుముందు మట్టికోర్టు ఆటగా పేరొందిన కబడ్డీకి ప్రో -కబడ్డీ లీగ్ తో ప్రపంచవ్యాప్తంగా ఎనలేని గుర్తింపు సాధ్యమైంది. పీకేఎల్ తరహాలోనే మరో లీగ్ ఫ్యాన్స్‌ను అలరించనుంది. అయితే.. భారత గడ్డపై కాకుండా విదేశీ నేలపై ఈ లీగ్ జరుగనుంది. వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్ తొలి సీజన్ దుబాయ్ వేదికగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. మొత్తం 30 జట్లు పాల్గొనే ఈ టోర్నీ వచ్చే ఏడాది ఫిబ్రవరి - మార్చి మధ్యలో జరుగనుందని సమాచారం. పీకేఎల్ విజయవంతం కావడంతో వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్ కూడా హిట్ అవుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇందుకు అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య కూడా పచ్చజెండా ఊపింది. దాంతో, ఎనిమిది ఫ్రాంచైజీ జట్లతో ఈ లీగ్‌ను జరపాలనే ఆలోచనతో ఉన్నారు ఆర్గనైజర్స్. 'కబడ్డీకి ప్రేక్షకాదరణ చాలా ఎక్కువ. అందుకే ఈ ఆటను భారత్‌లోనే కాకుండా విశ్వమంతా వ్యాప్తి చేయాలనుకుంటున్నాం. అందుకే.. వరల్డ్ సూపర్ కబడ్డీ లీగ్‌ను నిర్వహించాలనుకుంటున్నాం. ఈ లీగ్‌లో వరల్డ్ స్టేజిపై కబడ్డీ అనే మా లక్ష్యం నెరవేరుతుంది. ఈ టోర్నీతో ప్రతిభావంతులను వెలుగులోకి తేవడంతో పాటు ఈ ఆటకు ఒలింపిక్ గుర్తింపు కూడా తీసుకురావాలని భావిస్తున్నాం. ఎనిమిది జట్లతో జరుగబోయే తొలి ఎడిషన్ వేలంలో ఆటగాళ్లను కొనేందుకు రూ.48 కోట్ల పరిమితి విధించాలని అనుకుంటున్నాం' అని ఎస్‌జే అప్‌లిఫ్ట్ కబడ్డీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సంభవ్ జైన్ వెల్లడించాడు. డబ్ల్యూఎస్కేఎల్ ప్రతిపాదనకు పలు దేశాలు మద్దతు తెలుపుతున్నాయి. కబడ్డీని ఎంతో ఇష్టపడే దక్షిణ కొరియా, ఇరాన్, థాయ్‌లాండ్, పాకిస్థాన్, మలేషియా, జపాన్, కెనడాలతో పాటు ఆమెరికా సైతం కొత్త లీగ్ తొలి సీజన్ కోసం ఎదురుచూస్తున్నాయి.

## హైదరాబాద్ లో భారీ వర్షం..అధికారులను అప్రమత్తం చేసిన ఎండీ అశోక్ రెడ్డి



**హైదరాబాద్,జూన్ 30(సూర్యరేఖ)** నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.రంగంలోకి 17ఈఆర్టీ టీములు నగరంలో కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ లు (ఈఆర్టీ),ఎస్పీటి వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తరచూ సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.నీరు నిలిచే ప్రాంతాలపైన ఈ బృందాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,తాగునీటిలో తగిన మోతాదులో క్లోరీన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటి సరఫరాపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని..ఈ ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని..అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు.ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్ల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని,డీప్ మ్యాన్‌హోళ్ల దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా చూడాలని ఆదేశించారు.జీహెచ్ఎంసీ,హైడ్రా,పోలీస్ శాఖల అధికారులతో కలిసి సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని ఆయన సూచించారు.ఇతర వివరాలకు జలమండలి కస్టమేర్ కేర్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్

**సిద్దిపేట :** ప్రతీ ఒక్క ప్రజావాణి దరఖాస్తును పరిష్కరించి శనివారం లోగా ఆన్లైన్లో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ హైమద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలపై ఆర్జీలను స్వీకరించారు. ఉదయం 9:30 గంటల నుండి 10:30 గంటల వరకు జిల్లా అధికారులతో ఇప్పటివరకు ప్రజవాణి కార్యక్రమాల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారం మరియు పెండింగ్ వివరాలు శాఖల వారీగా రివ్యూ చేసి జిల్లాలోని ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం పై సదభిప్రాయం కలిగేలా అధికారులు వారి వారి శాఖలకు వచ్చిన ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేసి ఆయా వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. ఒకవేళ ఆయా సమస్యలు మీ పరిధిలో లేనట్లయితే ఆ వివరాలను కూడా అర్జీదారుకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. సమీక్షా కు హాజరు కానీ జిల్లా అధికారుల నుండి సంజాయితీ కోరాలని కలెక్టరేట్ ఏవో ను ఆదేశించారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమానికి 189 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇండ్లు కూల్చివే సహించం

**మేడ్చల్ :** పేదల ఇండ్లు కూల్చితే సహించబోమని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేదల బతుకులతో చెలగాటాలు ఆడితే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. జవహర్ నగర్ పోరుబాట శాంపిల్ మాత్రమేనన్న ఎంపీ, తెలంగాణ ప్రభుత్వం పేదలకు అన్యాయం చేయడం ఆపకుంటే యుద్దానికి పేదల పక్షాన పోరాటానికి నేను సిద్ధమన్నారు. బస్సు యాత్ర, పాద యాత్రలతో పేదలకు నాయకత్వం వహిస్తానని ప్రభుత్వంపై పోరుబాట సాగించి వారికి అండగా ఉంటానని తెలిపారు. బడాబాబుల భారతం పడుతామనుకుంటే హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూల్చడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పేదల ఇండ్లు కూల్చడం మానాలని, పేదలు 20 ఇండ్ల క్రితం నుంచి ఇండ్లు, గుడిసెలు నిర్మించుకున్నవారికి పట్టాలు ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు .

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**జగిత్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్. మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 37 పిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి,మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ జిల్లా అధికారులు,తహసీల్దర్లు,కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## బాధితుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలి:

**అదిలాబాద్ :** సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చి నేరుగా పోలీసు ముఖ్య అధికారికి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్న వెంటనే జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థ పై వారికి నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు.



# ‘కన్నప్ప’ విషయంలో ఇలా జరగడం బాధేస్తుంది

మంచు విష్ణు నటించిన కన్నప్ప సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పెరుగుతున్నాయి. ముఖ్యంగా హిందీ వర్షన్‌లో 80 శాతం సీట్లు ఫిల్ అవుతున్నాయి. ఆపై తమిళనాడులో కూడా మంచి టాక్‌తో రన్ అవుతుంది. తెలుగులో కూడా మ్యాట్నీ, సాయంత్రం షోలు హౌస్‌ఫుల్ అయిపోతున్నాయి. అయితే, తాజాగా మంచు విష్ణు తాజాగా సోషల్‌మీడియాలో విజ్ఞప్తి చేస్తూ పోస్ట్ పెట్టారు. కన్నప్ప చిత్రం పైరసీకి గురవుతుందంటూ విష్ణు ఆవేదన చెందారు. ఎంతో కష్టపడి సినిమాను నిర్మించామని, ఎవరూ పైరసీని ప్రొత్సహించొద్దంటూ విజ్ఞప్తి చేశారు. కన్నప్ప సినిమా పైరసీకి గురైందని నటుడు మంచు విష్ణు తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. ఇప్పటికే సుమారు 30వేలకు పైగానే అనధికారిక పైరసీ లింక్‌లను తమ టీమ్ తొలగించిందని ఆయన పేర్కొన్నారు. పైరసీ అంటే మరొకరి శ్రమను దోచుకోవడమే.. ఇలాంటి చర్య దొంగతనంతో సమానం అవుతుందన్నారు. ఈ విషయంలో చాలా బాధగా ఉందని విష్ణు ఆవేదన చెందారు. ‘ మన ఇంట్లో పిల్లలకు మనం దొంగతనం చేయమని మనం నేర్పించం. ఇలా ఒక సినిమాను పైరసీలో చూడడం కూడా దొంగతనంతో సమానమే అవుతుంది. దయచేసి ఇలాంటి వాటిని అరికట్టండి. మా ‘కన్నప్ప’ సినిమాను ఆదరించండి.’ అంటూ విష్ణు కోరారు. కన్నప్ప సినిమా మూడురోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 58 కోట్లు సాధించినట్లు తెలుస్తోంది. ఫస్ట్ షో డివైడ్ టాక్ వచ్చినప్పటికీ ఈ మూవీలో ప్రభాస్ పాత్రతో పాటు మంచు విష్ణు నటన అద్భుతంగా ఉందంటూ టాక్ బయటకు రావడంతో టికెట్లు బాగానే తెగుతున్నాయి. బుక్‌మైషోలో ప్రతిరోజు సుమారు ఒక లక్షకు పైగానే టికెట్లు సేల్ అవుతున్నాయి.




# మరో ఇంట్రెస్టింగ్ మూవీతో వస్తున్న అల్లరి నరేష్.. ఫస్ట్ లుక్ అదుర్స్

టాలీవుడ్‌లో మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్‌లో అల్లరి నరేష్ కూడా ఒకరు. నటన పరంగా ప్రాణం పెట్టి ప్రేక్షకులకి మంచి వినోదం పంచేందుకు ఎంతో ప్రయత్నిస్తుంటారు. తన నటనతో ఎంత నవ్వించగలడో అంతే రీతిలో ఏడిపించగలడు ఈ అల్లరోడు. ఒకప్పుడు కామెడీ సినిమాలే చేసిన అల్లరి నరేష్ ఇప్పుడు జానర్ మార్చి సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తున్నాడు. ఇప్పుడు అల్లరి నరేష్ తన 63వ సినిమాతో బిజీగా ఉండగా, ఈ మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్ . అల్లరి నరేష్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను విభిన్న కథలతో విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన మెహర్ తేజ్ దర్శకత్వంలో ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఇది అల్లరి నరేష్ కెరీర్‌లో 63వ చిత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఈ రోజు అల్లరి నరేష్ పుట్టిన రోజు సందర్భంగా, సినిమా యూనిట్ టైటిల్ మరియు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమాకు ‘ఆల్కహాల్’ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ పోస్టర్‌లో నరేష్ ఆల్కహాలిజం లో మునిగిపోయినట్టుగా కనిపిస్తున్నారు. ఇది ఒక భ్రమ, వాస్తవికత మధ్య నడిచే కథ అని అర్థమవుతోంది. ఈ సినిమాను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రుహాని శర్మ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుండగా, గిబ్రాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. వివిధ భావోద్వేగాలతో నిండి ఉండే ఈ సినిమా, అల్లరి నరేష్‌కి మరో హిట్‌గా నిలవనుందని సినీ వర్గాలు ఆశిస్తున్నారు.ఇక ఈ రోజు అల్లరి నరేష్ బర్త్ డే కాగా, ఆయనకి సోషల్ మీడియాలో అభిమానుల నుండే కాక సినీ ప్రముఖుల నుండి కూడా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

# ‘కుబేర’ క్లైమాక్స్ విమర్శలపై కమ్ముల


ధనుష్, అక్కినేని నాగార్జున ప్రధాన పాత్రల్లో విలక్షణ దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన ‘కుబేర’ తెలుగులో మంచి ఫలితాన్నందుకుంది. రిలీజ్ ముంగిట పెద్దగా హైప్ లేకపోయినా.. తొలి రోజు చాలా మంచి టాక్ రావడంతో సినిమా పుంజుకుంది. తొలి వీకెండ్లో భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. ఆ తర్వాత కూడా డీసెంట్ రన్‌తో కొనసాగుతోంది. రెండో వీకెండ్లో కూడా ఈ చిత్రానికి తెలుగులో మంచి వసూళ్లే వచ్చాయి. ఐతే ఇటు విమర్శకులు, అటు ప్రేక్షకులు ఈ సినిమా గురించి చాలా వరకు పాజిటివ్‌గానే మాట్లాడారు కానీ.. సెకండాఫ్, క్లైమాక్స్ విషయంలో మాత్రం కొంతమేర విమర్శలు తప్పలేదు. సినిమా నిడివి ఎక్కువైందని.. ఒక డిఫరెంట్ క్లైమాక్స్ ఆశిస్తే, హీరో చేతిలో విలన్ చావడం అనే రొటీన్ క్లైమాక్స్‌తో కమ్ముల నిరాశపరిచాడనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ విమర్శలపై శేఖర్ కమ్ముల ఓ ఇంటర్వ్యూలో స్పందించాడు. ‘కుబేర’ క్లైమాక్స్ గురించి చాలా ఆలోచించాకే.. ఇప్పుడు సినిమాలో ఉన్నది ఖరారు చేశామని కమ్ముల తెలిపాడు. విలన్ చాలా పవర్ ఫుల్ వ్యక్తి అని.. అతడికి వ్యతిరేకంగా సాక్ష్యాలు సేకరించి జైలుకు పంపించినా.. తనకున్న పవర్‌తో ఈ సిస్టంను మేనేజ్ చేసి అతను బయటికి వచ్చేస్తాడని.. ఆ స్థాయి వ్యక్తిని ఒక బిచ్చగాడు ఏమీ చేయలేడని కమ్ముల అభిప్రాయపడ్డాడు. అందుకే దేవా చేతిలో అతను చనిపోవడమే కరెక్ట్ అనిపించిందని చెప్పాడు.






# కిరణ్ అబ్బవరం మూవీ ఫస్ట్ లుక్ విడుదల..

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కెరీర్‌లో వైవిధ్యమైన చిత్రాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా చిత్రాలు చేస్తున్నారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం %ఖ–=ూవీూ%. ఈ చిత్రానికి జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. యుక్తి తర్జా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను హాస్య మూవీస్ మరియు రుద్రాంశ్ సెల్యులోయిడ్స్ బ్యానర్లపై రాజేష్ దండ మరియు శివ బొమ్మక్ నిర్మిస్తున్నారు.ఈ రోజు చిత్ర యూనిట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కిరణ్ అబ్బవరం మాస్ అవతారంలో మెరిసాడు. చేతులతో లుంగీ పట్టుకుని స్టైల్‌గా ముందుకు నడుస్తున్న విధానం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన వెనుక భాగంలో ఫైర్ ఎఫెక్ట్‌లతో తయారైన హార్ట్ షేప్ బాటిల్స్ డెకరేషన్ బాగుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే కొన్ని వర్గాలు ఈ పోస్టర్ డిజైన్‌ను ప్రభాస్ నటించిన ‘రాజాసాబ్’ మూవీ పోస్టర్‌కు పోలికలు ఉన్నాయని అంటున్నారు. ఈ విషయం పై యూనిట్ ఇంకా స్పందించలేదు.ఇక ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.కిరణ్ అబ్బవరం %–% చేతన్ భరద్వాజ్ కలయికలో ఇది మూడో చిత్రం.



# మాటిస్తున్నా.. కింగ్‌డమ్‌దే గెలుపు అంటూనే రిలీజ్ వాయిదా

విజయ్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ కింగ్‌డమ్. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో లేటెస్ట్ సెన్సేషన్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీ రెండు భాగాలుగా రానుంది. మొదటి భాగాన్ని మార్చి 28న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ సినిమా పూర్తి కాకపోవడంతో మే 30కి వాయిదా వేశారు. అప్పటికీ కింగ్‌డమ్‌కు మెరుగులు దిద్దడం కంప్లీట్ కానందున జూలై 4న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. సరిగ్గా ఇదే రోజు నితిన్ తమ్ముడు చిత్రం విడుదలవుతోంది. అయితే కింగ్‌డమ్ వాయిదా పడటం ఖాయం అంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. చివరకు అదే నిజమైంది. కింగ్‌డమ్ వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ ట్వీట్ చేశాడు. నేను ఏం పోస్ట్ చేసినా కింగ్‌డమ్ సినిమా గురించి తిట్లు వస్తూనే ఉంటాయని నాకు తెలుసు. మీకు వెండితెరపై ఒక అద్భుతమైన అనుభూతిని అందించేందుకు మా టీమ్ ఎంతగానో కృషి చేస్తోంది. మీకు మాటిస్తున్నా.. కింగ్‌డమ్ చూశాక మీకు కలిగే అనుభూతిని మాటల్లో చెప్పలేనంత గొప్పగా ఉంటుంది. నేను ఎంతో నమ్మితే కానీ ఇలా మాట్లాడనని మీకు తెలుసు. ఎందుకంటే ఏమాత్రం తేడా వచ్చినా మీ క్రియేటివిటీ అంతా నాపై చూపిస్తారు. నేను సినిమా చూసి చెప్తున్నా.. కింగ్‌డమ్‌దే గెలుపు. త్వరలోనే అదిరిపోయే రిలీజ్ డేట్ టీజర్, సాంగ్ అనౌన్స్‌మెంట్‌తో కలుద్దాం అన్నాడు. దీంతో కింగ్‌డమ్ వాయిదా కన్‌ఫార్మ్ అయిపోయింది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,